ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 06 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 250 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: నవమి - 11:56:33 వరకు నక్షత్రంమాఘ - 27:27:08 వరకు కరణంగర - 11:56:33 వరకు, వణిజ - 23:27:51 వరకు పక్షంకృష్ణ యోగంశుక్ల - 09:53:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

ఐదు కీలక ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

873.49 కోట్ల సహాయం అందించనున్న కేంద్రం

న్యూఢిల్లీ, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణలో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక అండదండలు అందిస్తోంది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రాష్ట్రంలో రూ.3,892 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఐదు కీలక ప్రాజెక్టులకు

మిగతా 2లో..

ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ

స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టనున్న ఈసీ

న్యూఢిల్లీ, నవంబర్ 05(ప్రజాజ్యోతి): ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టనున్నట్లు ఈసీ ప్రకటించింది. అర్హులైన ఓటర్లు, ముఖ్యంగా యువతను ఓటరు జాబితాలో చేర్చడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపింది. ఈ ప్రక్రియ

మిగతా 2లో..



దేశాన్ని గర్వపడేలా చేశారు

పారా అథ్లెట్లు చూపిన ప్రదర్శన అద్భుతం

లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌పై దృష్టిపెట్టండి

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం

క్రీడాకారులకు ప్రధాని మోదీ సన్మానం..

114 పతకాలు అద్దించిన భారత అథ్లెట్లు!

న్యూఢిల్లీ, నవంబర్ 05(ప్రజాజ్యోతి): జపాన్ వేదికగా ముగిసిన ఆసియా పారా గేమ్స్ 2026 పోటీల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. రికార్డు స్థాయిలో మొత్తం 114 పతకాలు సాధించిన భారత బృందంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో భేటీ అయ్యారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలను ప్రధాని స్వయంగా అభినందించారు. 2010 ఆసియా పారా క్రీడల్లో కేవలం 14 పతకాలు మాత్రమే గెలిచిన భారత్, ఇప్పుడు ఏకంగా 114 పతకాల మైలురాయిని చేరుకోవడం దేశ క్రీడా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనమని ప్రధాని ప్రశంసించారు. అథ్లెట్ల అసాధారణ ప్రతిభ దేశ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినిచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఈ టోర్నీలో భారత బృందం 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలను సొంతం చేసుకుంది.

మిగతా 12లో..

రైతుభరోసా పేరుతో కొత్త సైబర్ మోసం!

డబ్బు విడుదలయ్యిందని నకిలీ మెసేజ్‌లు

రూమర్లు నమ్మొద్దన్న వ్యవసాయ శాఖ

సైబర్ క్రైంకు వ్యవసాయ శాఖ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణలో రైతుభరోసా పథకం లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని వచ్చిన నకిలీ సందేశాలు కలకలం రేపాయి. రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమ చేసిందంటూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2,73,128 మంది రైతుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశాలు

మిగతా 2లో..

బ్యారేజీలు పునరుద్ధరిద్దాం

కాళేశ్వరం పునరుద్ధరణకు అడుగులు

4,193 కోట్లతో ప్రతిపాదనలకు సిద్ధం

- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి
- తెలంగాణవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ
- గ్లోబల్ సమ్మిట్ కు ముమ్మర ఏర్పాట్లు
- భారీ పెట్టుబడులు రాబట్టే దిశగా ప్లాన్
- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు
- సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం



హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రుల మీడియాంలో మంత్రులు వివరించారు. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు మరోసారి రాజకీయ, సాగునీటి రంగాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి, మరమ్మతుల పురోగతి, గోదావరి జలాల వినియోగంపై సభలో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి సురక్షితంగా వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిర్మాణ సంబంధిత తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థలు, నిపుణుల సలహాలు తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద నీరు కనిపిస్తున్నప్పటికీ దాన్ని ఎందుకు ఎత్తిపోస్తున్నారంటూ వస్తున్న విమర్శలపై కూడా కేబినెట్ సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుత నీటిమట్టం, బ్యారేజీల పరిస్థితుల దృష్ట్యా అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని ఇంజనీర్లు వివరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మేడిగడ్డ నుంచి

మిగతా 2లో..

రేపటినుండి సీఎం కొడంగల్ పర్యటన

9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మెగా రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

చివరి రోజు 50 వేల మంది రైతులతో బహిరంగ సభ

బందోబస్తు, ఏర్పాట్లపై అధికారులు నిమగ్నం

హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, పరిశ్రమలు, రహదారులు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుండగా.. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన రూ.46.08 కోట్ల విలువైన ప్రభుత్వ భవనాలను

మిగతా 12లో..

గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చేయండి

నవంబర్ 15 వరకు గ్లోబల్ సమ్మిట్

రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రాధాన్యత

ముఖ్యమంత్రులను ఆహ్వానించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా ఒక లైజనింగ్ అధికారిని

మిగతా 12లో..

కామన్ పాస్ ఇక రూ.4500లకే!

రోజువారీ పాస్ రూ.325లకే!

కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

మెట్రో, ఆర్టీసీ ప్రయాణికులకు తగ్గిన భారం



హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): హైదరాబాద్ క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి) ప్రాంతంలో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఊరట కలగనుంది. రెండు రవాణా వ్యవస్థల్లోనూ ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన ఉమ్మడి పాస్ ధరలను సగానికి పైగా తగ్గించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రోజువారీ పాస్‌ను రూ.325కు, నెలవారీ పాస్‌ను రూ.4,000 నుంచి రూ.4,500 మధ్యన అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మెట్రో రైలు, ఆర్టీసీ యాజమాన్యాలు అవగాహనకు వచ్చాయి.

మిగతా 2లో..

ముంచుకొస్తున్న కరువు..

ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి

554 మండలాల్లో అడుగంటిన నీరు

భూగర్భ జల శాఖ నివేదిక వెల్లడి



హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన నీటి ఎద్దడి కారణంగా హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను ఇళ్లకు పంపించేస్తున్నాయి. నారాయణ, చైతన్య లాంటి విద్యాసంస్థలు ఇప్పటికే సెలవులు ప్రకటించి, ఆ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి. మరోవైపు ప్రైవేట్ హాస్టళ్లలో తలెత్తిన నీటి సమస్యలతో ఐటీ ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 మధ్య హైదరాబాద్ నగరంలో ఏకంగా 34 శాతం లోటు వర్షపాతం నమోదు కావడమే ఈ తీవ్ర జల సంక్షోభానికి ప్రధాన కారణం. ఇది ఇలా ఉంటే మరో విషయం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో భూగర్భ జలాలు ఊహించని స్థాయిలో అడుగంటుతూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం భవిష్యత్తులో

మిగతా 2లో..

బీసీ సంఘాలకు ప్రభుత్వం భారీగా నిధులు

38 బీసీ కుల సంఘాల భవనాలకు మంజూరు

ఏడాదిలోగా పూర్తి చేసే లక్ష్యంగా నిర్మాణాలు

88.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని

మిగతా 12లో..

అరెస్టు తర్వాత 24 గంటల్లో కోర్టుకు

నిర్బంధించినప్పటి నుంచే గడువు మొదలు

ఆలస్యంగా హాజరుపరచడానికి అవకాశం లేదు

పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 05(ప్రజాజ్యోతి): ఒక వ్యక్తిని పోలీసులు నిర్బంధించిన సమయం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు చేసిన సమయం నుంచి మాత్రమే ఈ గడువును లెక్కించాలన్న వాదన చెల్లదని తేల్చిచెప్పింది. నిర్బంధించిన తర్వాత విచారణ లేదా ఇతర ప్రక్రియల పేరుతో గడిపిన సమయాన్ని

మిగతా 12లో..



తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా..

స్క్వేర్ ఫీటుకు రూ.200 వసూలు చేస్తున్నారు

ఏ బిల్డర్‌ను అడిగినా ఈ విషయం చెప్తారు

ప్రభుత్వంపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డర్ల నుంచి స్క్వేర్ ఫీట్‌కు రూ.200 చొప్పున ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను లేదా డెవలపర్‌ను అడిగినా ఈ ట్యాక్స్ నిజమని చెప్తారన్నారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ప్రధాని మోదీ కూడా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని పదేపదే ఆరోపించారు. అయితే, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కేవలం పెద్ద పెద్ద మాటలు చెప్పడమే తప్ప, ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలూ తీసుకోదని కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. "బడా భాయ్ మోదీ, హోంమంత్రి అమిత్ షాలు తరచూ హైదరాబాద్ వచ్చి రేవంత్, రాహుల్‌లపై

మిగతా 12లో..

సంపాదకీయం

పేదరికంపై భారత్ చారిత్రాత్మక పోరాటం..

ఒకప్పుడు ఆకలి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, నిరుపేదరికం.. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అతిపెద్ద సవాళ్లుగా నిలిచాయి. కోట్లాది కుటుంబాలు కనీస అవసరాలను తీర్చుకోవడానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితుల నుంచి నేడు పేదరికాన్ని గణనీయంగా తగ్గించుకున్న దేశంగా భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న పేదరిక నిర్మూలన ప్రయత్నాలకు ఇటీవలి సంవత్సరాల్లో మరింత ఊతం లభించడంతో దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పునకు అద్దం పట్టేలా ప్రపంచ బ్యాంకు అక్టోబర్ 2026లో విడుదల చేసిన 'పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్' నివేదిక కీలక గణాంకాలను వెల్లడించింది. 2011 నుంచి 2023 మధ్య కాలంలో సుమారు 49.6 కోట్ల మంది ప్రజలు రోజుకు 4.20 డాలర్ల అంతర్జాతీయ పేదరిక ప్రమాణానికి ఎగువకు చేరినట్లు నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో రోజుకు 3 డాలర్ల ప్రమాణం ప్రకారం తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గడం విశేషం. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ఈ పరిణామం ఒక కీలక మైలురాయిగా నిలిచింది.

భారతదేశంలో పేదరికం తగ్గుదల ఎంత విస్తృతంగా జరిగిందో ప్రపంచ బ్యాంకు వెల్లడించిన గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. 2011లో రోజుకు 4.20 డాలర్ల అంతర్జాతీయ పేదరిక ప్రమాణం కంటే తక్కువ ఆదాయ స్థాయిలో జీవిస్తున్న వారి వాటా 57.7 శాతంగా ఉండేది. 2023 నాటికి అది 16.1 శాతానికి పడిపోయింది. అంటే కేవలం పన్నెండేళ్ల వ్యవధిలోనే సుమారు 49.6 కోట్ల మంది ప్రజలు ఈ పేదరిక ప్రమాణానికి ఎగువకు చేరారు.ఇది సాధారణమైన గణాంక మార్పు కాదు. కోట్లాది కుటుంబాల జీవన పరిస్థితుల్లో వచ్చిన మార్పునకు ప్రతిబింబం. కుటుంబాలకు ఆదాయ వనరులు పెరగడం, వినియోగ సామర్థ్యం మెరుగుపడటం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా కనీస అవసరాలకు భరోసా లభించడం వంటి అంశాలు ఈ పరిణామానికి దోహదపడ్డాయి.అయితే 2023 నాటికీ ఇదే ప్రమాణం ప్రకారం సుమారు 23.2 కోట్ల మంది పేదరికంలోనే ఉన్నారని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. అంటే సాధించిన ప్రగతితో పాటు ఇంకా చేయాల్సిన పని కూడా ఎంతో ఉందని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ నివేదికలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం తీవ్ర పేదరికం తగ్గుదల. రోజుకు 3 డాలర్ల అంతర్జాతీయ ప్రమాణం ప్రకారం 2011లో దేశ జనాభాలో 27.1 శాతం మంది తీవ్ర పేదరికంలో ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 2.6 శాతానికి తగ్గింది.తీవ్ర పేదరికం అంటే కనీస ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి కూడా సరిపడా ఆర్థిక వనరులు లేకపోవడం. ఇలాంటి పరిస్థితుల్లో జీవించే ప్రజల సంఖ్య గణనీయంగా తగ్గడం సామాజిక అభివృద్ధికి ముఖ్యమైన సూచికగా పరిగణించవచ్చు.అంతర్జాతీయ కొనుగోలు శక్తి సమానత్వం ఆధారంగా రూపొందించిన ఈ గణాంకాలు భారతదేశంలో ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పును సూచిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు విశ్లేషణ ప్రకారం పేదరికం తగ్గుదల ప్రపంచవ్యాప్తంగా వేగంగా నమోదైన పరిణామాల్లో భారత్ ఒకటిగా నిలిచింది.

పేదరికం తగ్గడానికి కేవలం సంక్షేమ పథకాలే కాకుండా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడం కూడా అత్యంత కీలకం. కుటుంబంలో ఒకరికి స్థిరమైన ఆదాయం లభించినా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పు ప్రారంభమవుతుంది. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది సంపాదనలో భాగస్వాములైతే కుటుంబ జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2017 నుంచి 2023 మధ్య దేశంలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య సుమారు 13.4 కోట్ల మేర పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కార్యకలాపాల విస్తరణ పేదరిక తగ్గుదలకు దోహదపడింది.వ్యవసాయం, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, సేవారంగం వంటి విభాగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం వల్ల కుటుంబాలకు ఆదాయ మార్గాలు ఏర్పడ్డాయి. అయితే ఉద్యోగాల సంఖ్య పెరగడమే కాకుండా వాటి నాణ్యత, వేతనాలు, ఉద్యోగ భద్రత కూడా భవిష్యత్తులో కీలకంగా మారనున్నాయి. భారతదేశ పేదరిక తగ్గుదలలో మహిళల ఆర్థిక భాగస్వామ్యం మరో ముఖ్యమైన అంశంగా నిలిచింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఉపాధి రంగంలోకి రావడం, స్వయం ఉపాధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొనడం కుటుంబ ఆదాయాలకు అదనపు బలాన్ని ఇచ్చాయి.మహిళలు సంపాదనలో భాగస్వాములైతే దాని ప్రభావం కుటుంబానికే పరిమితం కాదు. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, గృహ అవసరాలు, కుటుంబ భద్రత వంటి అంశాలపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది.మహిళా స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు రుణ సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, చిన్న వ్యాపారాలకు లభిస్తున్న అవకాశాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయి. అయితే మహిళలకు మరింత మెరుగైన వేతనాలతో కూడిన స్థిరమైన ఉపాధి కల్పించాల్సిన అవసరం ఇంకా ఉంది. పేదరికం తగ్గుదలలో సామాజిక భద్రతా కార్యక్రమాల పాత్రను కూడా ప్రపంచ బ్యాంకు గుర్తించింది. ముఖ్యంగా ఆహార సబ్సిడీలు, గృహ నిర్మాణ సహాయం, రైతులకు ఆర్థిక తోడ్పాటు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి కార్యక్రమాలు పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడంలో సహాయపడ్డాయి.ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన: ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ ద్వారా కోట్లాది అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన: సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహ నిర్మాణంలో ఆర్థిక సహాయం అందిస్తూ నివాస భద్రతకు తోడ్పడింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి: అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వ్యవసాయ కుటుంబాలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించింది.

ప్రత్యక్ష నగదు బదిలీ.. ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరవేసే విధానం ద్వారా పథకాల అమలులో పారదర్శకతకు అవకాశం కల్పించింది.ఈ కార్యక్రమాలతో పాటు ప్రజల వినియోగ సామర్థ్యం పెరగడం, ఉపాధి విస్తరణ, కుటుంబ ఆదాయాల్లో మార్పులు కూడా పేదరిక తగ్గుదలకు తోడ్పడ్డాయని ప్రపంచ బ్యాంకు విశ్లేషణ వెల్లడిస్తోంది. భారతదేశంలో పేదరికం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలతో ముడిపడి ఉన్న సమస్య. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు వర్షాలు, పంట దిగుబడులు, మార్కెట్ ధరలు, సాగు ఖర్చులు వంటి అంశాలు ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేస్తుంటాయి.ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ఉపాధి అవకాశాల పెరుగుదల, ఆహార భద్రత, సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు పేద కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసాను కల్పించాయి.వ్యవసాయ అనుబంధ రంగాలు, పశుపోషణ, చిన్న పరిశ్రమలు, గ్రామీణ వ్యాపారాలు విస్తరించడం కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చాయి. అయితే వ్యవసాయ కుటుంబాల ఆదాయాలను స్థిరంగా పెంచడం, సాగు వ్యయాలను తగ్గించడం, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం వంటి అంశాలపై మరింత దృష్టి అవసరం. పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్పుకోవడం ఒకవైపు సంతోషకరమైన పరిణామమే అయినప్పటికీ.. దేశంలో ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు అనేకం ఉన్నాయి. పేదరిక రేఖకు ఎగువకు చేరిన ప్రతి కుటుంబం ఆర్థికంగా పూర్తిగా స్థిరపడిందని భావించలేం. అనారోగ్యం, ఉద్యోగ నష్టం, ప్రకృతి వైపరీత్యాలు, అప్పుల భారం వంటి పరిస్థితులు మళ్లీ పేదరికంలోకి నెట్టే ప్రమాదం ఉంటుంది.ప్రపంచ బ్యాంకు విశ్లేషణలో కూడా ఉద్యోగాల నాణ్యత, వేతనాల్లో అసమానతలు, యువత నిరుద్యోగం, ప్రాంతీయ అభివృద్ధి అంతరాలు వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.ముఖ్యంగా యువతకు నైపుణ్య ఆధారిత ఉపాధి కల్పించడం, పరిశ్రమలను విస్తరించడం, చిన్న వ్యాపారాలకు రుణ సదుపాయాలు మెరుగుపరచడం, మహిళలకు సమాన ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు భవిష్యత్తు అభివృద్ధికి కీలకం కానున్నాయి.

పేదరికం తగ్గుదల గురించి మాట్లాడేటప్పుడు శాతాలు, సంఖ్యలు మాత్రమే కనిపించవచ్చు. కానీ ఆ గణాంకాల వెనుక కోట్లాది కుటుంబాల జీవితాల్లో వచ్చిన మార్పులు దాగి ఉన్నాయి. ఒక కుటుంబానికి సొంత ఇల్లు లభించడం, పిల్లలకు మెరుగైన విద్య అందించడం, రోజువారీ ఆహార అవసరాలు తీరడం, కుటుంబంలో మహిళకు ఆదాయం రావడం, రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా కలగడం.. ఇవన్నీ పేదరిక నిర్మూలనలో భాగమే.2011లో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం 2023 నాటికి 2.6 శాతానికి తగ్గడం.. అదే సమయంలో 4.20 డాలర్ల పేదరిక ప్రమాణం ప్రకారం 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గడం భారతదేశంలో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక పరిణామాలకు నిదర్శనంగా నిలుస్తోంది.అయితే ఈ ప్రగతిని శాశ్వతంగా నిలబెట్టుకోవాలంటే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, స్థిరమైన ఉపాధి, గౌరవప్రదమైన జీవన పరిస్థితులు అందించాల్సిన అవసరం ఉంది. పేదరిక నిర్మూలన అనేది ఒక్కరోజులో సాధించే లక్ష్యం కాదు. నిరంతర విధానాలు, ఆర్థిక అవకాశాలు, ప్రజల భాగస్వామ్యం, సామాజిక భద్రతా కార్యక్రమాల సమన్వయంతోనే సాధ్యమవుతుంది. ఈ దిశగా భారత్ సాధించిన పురోగతి అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

బ్యారేజీలు పునరుద్ధరిద్దాం

మొదటిపేజీ తరువాయి..

ఎత్తిన నీరు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసివేయాల్సి ఉంటుందని.. అయితే భద్రతా కారణాలతో ఆ గేట్లను తెరిచే ఉంచాలని ఎన్డీఎస్ఏ సూచించిన విషయాన్ని అధికారులు వివరించారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సుమారు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నిర్మాణ లోపాల కారణంగా చేపట్టాల్సిన మరమ్మతుల ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థలే భరించేలా.. అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. ప్రాథమిక పునరుద్ధరణ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని కూడా వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది అనుమతులు పొందేందుకు ప్రయత్నించాలని.. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలని సీఎం రేవంత్ అధికారులకు ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని తిరిగి సాధించే పనులు, బ్యారేజీల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను రెండు దశలుగా విభజించాలని సూచించారు. పనుల్లో ఆలస్యం జరగకుండా అనుమతులు, సాంకేతిక పరిశీలనలు, ఇతర ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని చెప్పారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేందుకు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తరలించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. ప్రస్తుత ప్రభుత్వం 3 ఏళ్లలో సగటున 18.13 టీఎంసీలకు పెరిగిందని తెలిపారు. ఇది గతంతో పోలిస్తే 89 శాతం అధికమని పేర్కొన్నారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు.. మొత్తంగా 24.81 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గత 3 ఏళ్లలో ప్రాజెక్టు మరమ్మతులు, బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకున్న చర్యలను సభలో వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాళేశ్వరం పరివాహక జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు గోదావరి ప్రాంతాన్ని సందర్శించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గోదావరి నుంచి నీటి ప్రవాహం, ఎత్తిపోతల ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, గోదావరి వద్దే మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించాలని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

మరోవైపు ప్రపంచ దేశాలతో పోటీపడేలా పారిశ్రామిక విధానాలు అమలు చేస్తున్నామని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సీనియర్ మంత్రులకు బాధ్యతలు అప్పగించామని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా భారీగా పెట్టుబడులు పెడతారనే విశ్వాసం ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీపావళి సందర్భంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాన్ని తెలంగాణవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, నిర్మాణం పూర్తయిన అన్ని ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని వెల్లడించారు. నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని, నవంబర్ 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారని, ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తాం. తెలంగాణలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తాం. నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరిస్తాయి. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్, 2003ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపిందని, ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారని, ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని వెల్లడించారు.తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం, 1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునే కాలపరిమితిని 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

రైతుభరోసా పేరుతో కొత్త సైబర్ మోసం!

మొదటిపేజీ తరువాయి..

అందాయి. ఈ మెసేజ్‌లు చూసిన రైతులు నిజంగానే తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయని భావించారు. అయితే బ్యాంకు ఖాతాలను పరిశీలించాక నగదు జమ కాలేదని గుర్తించి అయోమయానికి గురయ్యారు. తెలంగాణలో రైతుభరోసా పథకం లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని వచ్చిన నకిలీ సందేశాలు కలకలం రేపాయి. రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమ చేసిందంటూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2,73,128 మంది రైతుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశాలు (ఎస్ఎంఎస్) అందాయి. ఈ మెసేజ్‌లు చూసిన రైతులు నిజంగానే తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయని భావించారు. అయితే బ్యాంకు ఖాతాలను పరిశీలించాక నగదు జమ కాలేదని గుర్తించి అయోమయానికి గురయ్యారు. రైతుభరోసా నిధులను ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేశారు. నిధులు జమయ్యాయంటూ వచ్చిన సందేశాలు పూర్తిగా అనధికారికమైనవని తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా ఈ మెసేజ్‌లు వచ్చాయా? లేక సైబర్ నేరగాళ్ల పని ఏమైనా ఉందా? అనే కోణంలో పరిశీలన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకం పేరుతో ఇలాంటి తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం వల్ల రైతుల్లో గందరగోళం ఏర్పడటమే కాకుండా వ్యవసాయశాఖపై నమ్మకం, రైతుభరోసా పథకం విశ్వసనీయత కూడా దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి స్పందించారు. 2,73,128 మంది రైతులకు నకిలీ సందేశాలు వెళ్లిన విషయాన్ని గుర్తించి సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందేశాలు ఎక్కడి నుంచి పంపించారనే అంశంపై విచారణ జరపాలని కోరారు.రైతులు ఇలాంటి సందేశాలను చూసి తొందరపడి స్పందించవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

ఐదు కీలక ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి..

కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం నవంబర్ 3న ఢిల్లీలో జరిగిన నాలుగో నేషనల్ ఎపెక్స్ కమిటీ సమావేశంలో తీసుకున్నారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం రూ.873.49 కోట్ల సహాయం అందించనుంది. ఇప్పటివరకు యూసీఎఫ్ కింద తెలంగాణకు మొత్తం ఎనిమిది ప్రాజెక్టులకు ఆమోదం లభించి, వాటి విలువ రూ.9,573 కోట్లకు చేరుకుంది. ఈ విధానంలో కేంద్రం 20 నుంచి 25 శాతం వరకు భరించగా, రాష్ట్ర ప్రభుత్వం సమాన వాటా సమకూరుస్తుంది. మిగిలిన మొత్తాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా ప్రైవేటు సంస్థలు పెట్టుబడి పెట్టనున్నాయి.దీనివల్ల ప్రభుత్వంపై పూర్తి ఆర్థిక భారం పడకుండా భారీ పనులు చేపట్టే అవకాశం ఏర్పడుతోంది.ఐదు ప్రాజెక్టుల్లో అతిపెద్దది హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతానికి గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండో, మూడో దశలు. దీనికి రూ.1,992 కోట్లు కేటాయించారు. ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ల వరకు దాదాపు 120 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేయనున్నారు. 120 ఎమ్ఎల్‌డి, 70 ఎమ్ఎల్‌డి సామర్థ్యంతో రెండు నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించనున్నారు. ఇప్పటికే మొదటి దశతో కలిపి ఈ పథకం ద్వారా 20 టీఎంసీ నీరు అదనంగా అందుతుంది. 2035 వరకు దాదాపు 1.74 కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఇటీవల బయటి రింగ్ రోడ్ చుట్టూ విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థలు కూడా ఈ ప్రయోజనం పొందనున్నాయి.వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సమగ్ర వరదనీటి నిర్వహణ వ్యవస్థ ఏర్పాటుకు రూ.1,465 కోట్లు మంజూరయ్యాయి.

వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరించనున్నారు. 24 క్రానిక్ ఫ్లడ్ పాయింట్లను పరిష్కరించేలా ఆర్‌సిసి, మట్టి డ్రైన్లు నిర్మించనున్నారు. పది ప్రధాన చెరువుల బంధాలను బలోపేతం చేయడంతోపాటు స్పాంజ్ సిటీ కాన్సెప్ట్, సహజ ఆధారిత పరిష్కారాలు కూడా చేర్చనున్నారు. దీనివల్ల వరంగల్‌లో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. చారిత్రక వరంగల్ కోట కందకం పునరుద్ధరణ, అభివృద్ధికి రూ.209.08 కోట్లు కేటాయించారు. కాకతీయుల కాలం నాటి ఈ కందకాన్ని పూర్వవైభవంతో తీర్చిదిద్ది పర్యాటక ఆకర్షణగా మార్చనున్నారు. హనుమకొండ సెంట్రల్ బస్ డిపో నిర్మాణానికి రూ.168.80 కోట్లు మంజూరయ్యాయి. ఆధునిక రవాణా సదుపాయాలు, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా ఈ ప్రాజెక్టు రూపొందించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.57.50 కోట్లు కేటాయించారు. అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదోది అయిన ఈ ఆలయ పరిసరాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు.గత మే నెలలో జరిగిన తొలి సమావేశంలో వరంగల్ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు రూ.4,674 కోట్లు, కరీంనగర్ పార్కులు-చెరువుల అభివృద్ధికి రూ.840 కోట్లు, ఖమ్మం ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ కేంద్రానికి రూ.160 కోట్లు ఇప్పటికే ఆమోదం లభించాయి. తాజా ఐదు ప్రాజెక్టులతో కలిపి తెలంగాణ పట్టణాలు మరింత ఆధునికంగా, ప్రజలకు అనుకూలంగా మారనున్నాయి.

ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ

మొదటిపేజీ తరువాయి..

కోసం సిబ్బందిని సమకూర్చాలని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఈసీ లేఖ రాసింది. నకిలీ ఎంట్రీలు, ఒకే పేరుపై రెండు ఓట్లు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులపై కచ్చితంగా క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఈసీ స్పష్టం చేసింది. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో రెండు శాతానికి మించి ఓట్ల తొలగింపు ఉన్నా, లేదా ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఇ=ూలు స్వయంగా వాటిని పరిశీలించాలని ఆదేశించింది. కొత్త ఓటరు నమోదు కోసం ఇచ్చే ఫారం 6 మార్పులు, చేర్పుల కోసం ఇచ్చే ఫారం 8లో ఆధార్ వివరాలు సమర్పించడం పూర్తిగా స్వచ్ఛందం అని ఈసీ స్పష్టం చేసింది. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో ఏ ఒక్క దరఖాస్తునూ తిరస్కరించరాదని, ఇప్పటికే ఉన్న పేరును ఓటరు జాబితా నుంచి తొలగించరాదని పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ, మిజోరం, ఒడిశా, సిక్కింలో ఓటర్ల జాబితాల వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణను ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. 2027 ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1న అర్హత పొందే వారి నుంచి ముందస్తు దరఖాస్తులను స్వీకరించడానికి వీలు కల్పించడం. అభ్యంతరాల పరిశీలన అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలు నవంబర్ 30న ప్రచురించనున్నారు. 2027 జనవరి 21న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అలాగే, ఓటర్ల జాబితాలో ఒకే పేరు ఒకటి కంటే ఎక్కువసార్లు ఉండి, వాటిని తొలగించాల్సి వస్తే క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేశారు. ఏదైనా ఒక పోలింగ్ కేంద్రంలో 2 శాతం కంటే ఎక్కువ ఓట్ల తొలగింపులు ఉన్నా, లేదా ఒకే వ్యక్తి 5 కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు స్వయంగా వెళ్లి క్రాస్-చెక్ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. మరోవైపు, 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.

ముంచుకొస్తున్న కరువు..

మొదటిపేజీ తరువాయి..

హాహాకారాలు తప్పవనే ఆందోళన మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాలకు గాను ఏకంగా 554 మండలాల్లో భూగర్భ జలమట్టాలు దారుణంగా పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పదేళ్ల క్రితం పరిస్థితితో పోలిస్తే 20 మీటర్ల లోతున నీళ్లు దొరికే ప్రాంతాల విస్తీర్ణం ఇప్పుడు ఏకంగా నాలుగు రెట్లు పెరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏడాది వ్యవధిలోనే సగటున 7.17 మీటర్ల మేర నీటి మట్టాలు అడుగంటడం తాగడానికి, సాగుకు రానున్న గడ్డుకాలాన్ని స్పష్టం చేస్తోంది. భూగర్భ జలాల తాజా పరిస్థితిపై తెలంగాణ భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. రాష్ట్రంలో సగటు భూగర్భ జల మట్టం 7.77 మీటర్ల లోతుకు పడిపోయింది. గత ఏడాది అక్టోబర్ గణాంకాలతో పోలిస్తే ఇది రెండు మీటర్లు తక్కువ. 2016-2025 దశాబ్దపు సగటును పరిశీలిస్తే, 20 మీటర్ల కంటే లోతులో నీళ్లు దొరికే ప్రాంతాల విస్తీర్ణం 478 చదరపు కిలోమీటర్ల నుంచి ఏకంగా 2,040 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. రాష్ట్రంలోని 89 శాతం మండలాల్లో దశాబ్దపు సగటు కంటే నీటి మట్టాలు దారుణంగా పడిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. భూగర్భ జలాల తాజా పరిస్థితిపై తెలంగాణ భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. రాష్ట్రంలో సగటు భూగర్భ జల మట్టం 7.77 మీటర్ల లోతుకు పడిపోయింది. గత ఏడాది అక్టోబర్ గణాంకాలతో పోలిస్తే ఇది రెండు మీటర్లు తక్కువ. 2016-2025 దశాబ్దపు సగటును పరిశీలిస్తే, 20 మీటర్ల కంటే లోతులో నీళ్లు దొరికే ప్రాంతాల విస్తీర్ణం 478 చదరపు కిలోమీటర్ల నుంచి ఏకంగా 2,040 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. రాష్ట్రంలోని 89 శాతం మండలాల్లో దశాబ్దపు సగటు కంటే నీటి మట్టాలు దారుణంగా పడిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ జల విలయానికి ప్రధాన కారణం వర్షాభావమే. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు రాష్ట్రంలో 831 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 628 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఏకంగా 24 శాతం లోటు వర్షపాతం రికార్డయింది. మొత్తం 33 జిల్లాలకు గాను కేవలం 11 జిల్లాల్లోనే సాధారణ వర్షాలు కురవగా, మిగిలిన 22 జిల్లాలు తీవ్ర వర్షాభావం ఎదుర్కొన్నాయి. జోగులాంబ గద్వాలలో అత్యధికంగా 50 శాతం లోటు నమోదు కాగా, నారాయణపేటలో 44 శాతం, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లో 42 శాతం చొప్పున వర్షపాతం తక్కువగా నమోదైంది.దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యంత తీవ్రంగా కనిపిస్తోంది. ఏడాది వ్యవధిలో సూర్యాపేటలో అత్యధికంగా 6.05 మీటర్లు, వికారాబాద్‌లో 5.39, నారాయణపేటలో 5.25, మహబూబ్‌నగర్‌లో 5.01, మేడ్చల్-మల్కాజిగిరిలో 4.99 మీటర్ల మేర నీటి మట్టాలు పతనమయ్యాయి. ఇక హైదరాబాద్ జిల్లా విషయానికొస్తే గతేడాది 6.12 మీటర్ల లోతులో ఉన్న జలమట్టం ఇప్పుడు ఏకంగా 10.62 మీటర్లకు పడిపోయింది. అంటే 4.50 మీటర్ల మేర నీరు అడుగంటింది. నగర పరిధిలో సాధారణం కంటే 34 శాతం వర్షం తక్కువగా కురవడమే ఈ దుస్థితికి కారణం. కృష్ణా, గోదావరి బేసిన్ల పరిధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

కామన్ పాస్ ఇక రూ.4500లకే!

మొదటిపేజీ తరువాయి..

ఈ అంశంపై నేడో రేపో సీఎస్ సంజయ్‌జాజుతో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మెట్రో రైలు సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ భేటీతో కామన్ పాస్ ధరలపై పూర్తి స్పష్టత, అధికారిక ప్రకటన రానున్నట్లు ఆర్టీసీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఉమ్మడి పాస్ కొత్త ధరల్ని దీపావళి పండుగ నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో మెట్రో రైళ్లతోపాటు ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రయాణం కోసం ఈ కామన్ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే ముందుగా నిర్ణయించిన ధరలు అధికంగా ఉండటంతో ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించడం ప్రయాణికుల్లో ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో ధరలు తగ్గించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మెట్రోరైలు సలహాదారు ఎన్వీఎస్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఆ ధరను రూ.4,000 లేదా రూ.4,500కు పరిమితం చేయాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందులో ఆర్టీసీకి రూ.1,000, మిగిలిన రూ.3,000 లేదా రూ.3,500 మెట్రోకు కేటాయించేలా చర్చించారు. రోజువారీ పాస్ ప్రస్తుతం రూ.400 ఉండగా దాన్ని రూ.325కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. ఈ పాస్‌లో ఆర్టీసీకి రూ.75, మెట్రోకు రూ.250 చొప్పున షేర్‌ను కేటాయించనున్నట్లు తెలిసింది. మొదటగా నిర్ణయించిన రోజువారీ పాస్‌ను రూ.400లుగా నిర్ణయించారు. ఇందులో మెట్రో ఛార్జీ రూ.300లు, ఆర్టీసీ ఛార్జీకి రూ.100 చొప్పున కేటాయించారు. నెలవారీ పాస్‌ను రూ.8,500లుగా నిర్ణయించగా దీంట్లో మెట్రో ఛార్జీ రూ.7 వేలు, ఆర్టీసీ ఛార్జీ రూ.1,500లు ఉంది. మొదటిసారి కార్డు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణికుల నుంచి రూ.100 అదనంగా వసూలు చేయనున్నట్లు తెలిపారు.

NOTICE

IN THE COURT OF THE DISTRICT JUDGE - 1 AND EX-OFFICIO MEMBER OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, AHMEDPUR, TALUKA AHMEDPUR & DISTRICT LATUR. (MAHARASHTRA STATE)

M.A.C.P. No. 15/2025
Jayshri Vs. Dnyaneshwar & Ors
Exh. No. 23.

To,
RESPONDENT NO.2.
Shazeb Khan Pathan S/o Zamakhan Pathan
Age- Major, Occu-Business
R/o. Panjesha, Tq. And Dist. Adilabad.
(State of Telangana Mob. 9000944600).

Take notice that the above named petitioner, claimants have made application to this tribunal claiming compensation U/Sec. 166 Motor V. Act from you.

You being one of the above said respondent No.2 is hereby warned to appear before this tribunal in person or by a pleader duly instructed on the **Dated 08/12/2026** at 10.30 a.m. in District Judge 1 & Ex- Officio Member of MACT, Ahmedpur. It show cause against the application, failing where in the said M.A.C.P. application will be heard and determined ex-parte.

Given under my hand and seal of this court this 03/11/2026.

By Order
Superintendent
District Court-1 Ahmedpur.
Dist. Latur.
Maharashatra (State)

జన్నారంలో భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరించిన పిసిఆర్



జన్నారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : సద్గురు శ్రీ శ్రీ యోగానంద భారతి స్వామివారి ఆశీర్వాదంతో జన్నారం మండలంలో భగవద్గీత పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కాంట్రాక్టర్ మాదాడి పూర్ణచంద్రరావు చేతుల మీదుగా భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక చింతన, భక్తి మార్గం వైపు అడుగులు వేయాలని, భగవద్గీతలోని విలువైన బోధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని జీవితంలో ఆచరించాలని ఆకాంక్షించారు. యువతలో ఆధ్యాత్మిక భావాలు, నైతిక విలువలు పెంపొందించడంతో పాటు ధర్మబద్ధమైన జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు భగవద్గీత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భగవద్గీత పుస్తకాలు కావలనుకునే వారు కొత్తపేట-కవ్వాల్‌లోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈ బుక్కులు భక్తులకు అందుబాటులో ఉంచబడతాయని, ఆసక్తి గల భక్తులు దేవస్థానాన్ని సందర్శించి పుస్తకాలను పొందవచ్చని తెలియజేశారు. యువత భక్తి మార్గంలో పయనిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాశెట్టి లక్ష్మన్, కొత్త శ్రీనివాస్ లక్ష్మీనారాయణ భీమయ్య సతీష్ గౌడ్ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

- ఏఐటీయూసీలో చేరిన మంచిర్యాల ఆర్టీసీ డిపో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లు



మంచిర్యాల, 5, నవంబర్ (ప్రజాజ్యోతి): ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు .మంచిర్యాల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లు గురువారం ఏఐటీయూసీ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు వారిని సాదరంగా సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వారికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు సమయానికి వేతనాలు అందకపోవడం, తక్కువ వేతనాలు, అధిక పని ఒత్తిడి తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం వారికి రావాల్సిన అన్ని హక్కులు, సౌకర్యాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు మామిడిపల్లి శ్రీనివాస్, డిపో కార్యదర్శి గోలి శంకర్, శంకరాచారి, అంజయ్య, సర్వర్ పాషా, రాజు, భారతి, సుమలత, పానుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత బొగ్గు కార్మికులకు పెన్షన్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

- ధన్‌బాద్ సీఎంపీఎఫ్ఓ కార్యాలయం నుంచి నిధులు విడుదల చేయాలి

- ఐదు లక్షల మంది విశ్రాంత బొగ్గు కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు.. తక్షణమే పెన్షన్ చెల్లించాలి

- హిందూ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) నాయకుడు రియాజ్ అహ్మద్



మంచిర్యాల, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : సింగరేణి, కోల్ ఇండియా సంస్థల్లో దశాబ్దాల పాటు కష్టపడి పనిచేసి పదవీ విరమణ పొందిన బొగ్గు గని కార్మికులకు నెలవారీ పెన్షన్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై విశ్రాంత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలోని గోదావరిఖని (జీడీకే), కొత్తగూడెం, రామగుండం ప్రాంతాలకు చెందిన పలువురు పెన్షనర్ల ఖాతాల్లో సెప్టెంబర్, అక్టోబర్ 2026 నెలలకు సంబంధించిన పెన్షన్ జమ కాకపోవడంతో వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి ధన్‌బాద్‌లోని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) ప్రధాన కార్యాలయం నుంచి అన్ని ప్రాంతాలకు పెన్షన్ నిధులు విడుదల చేయాలని హిందూ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) నాయకుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. స్థానిక గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయంలో విచారించగా, బ్యాంకుల స్థాయిలో ఎలాంటి సమస్య లేదని, ధన్‌బాద్ ప్రధాన కార్యాలయం నుంచి నిధులు అందకపోవడం వల్లే పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు, 2026 ఏప్రిల్ 1న లోక్‌సభలో అడిగిన అన్‌స్టార్డ్ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో సీఎంపీఎఫ్ఓ స్థాయిలో పెన్షన్ క్లెయిమ్‌లు పెండింగ్‌లో లేవని, పెన్షన్ క్లెయిమ్‌లను 30 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుందని వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, 2026 ఆగస్టు 31న సీఎంపీఎఫ్ఓ కమిషనర్ జారీ చేసిన సమాచారంతో పాటు, ఆగస్టు 19నాటి కార్యాలయ నోట్‌లో 2022 మార్చి యాక్చురియల్ మదింపు ప్రకారం కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ సుమారు రూ.48 వేల కోట్ల లోటులో ఉన్నట్లు పేర్కొనడం పెన్షనర్లలో ఆందోళనకు కారణమైందన్నారు. ఈ పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం, సీఎంపీఎఫ్ఓ అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. 60 నుంచి 80 ఏళ్ల వయస్సులో ఉన్న వేలాది మంది విశ్రాంత బొగ్గు కార్మికులకు పెన్షనే ప్రధాన జీవనాధారమని, వారిలో అనేకమంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి నెలా ఐదో తేదీలోగా పెన్షన్ అందాల్సి ఉండగా, రోజుల తరబడి ఆలస్యం కావడం వల్ల మందులు, నిత్యావసరాలు, కుటుంబ ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎంపీఎఫ్ఓ కమిషనర్ విజయ్ కుమార్ మిశ్రాకు గురువారం వినతిపత్రం పంపుతూ పలు డిమాండ్లు చేశారు. ధన్‌బాద్ ప్రధాన కార్యాలయం నుంచి గోదావరిఖనితో పాటు అన్ని ప్రాంతాలకు తక్షణమే పెన్షన్ నిధులు విడుదల చేయాలని, పెన్షన్ ఫండ్ ఆర్థిక పరిస్థితిపై బహిరంగ ప్రకటన చేసి పెన్షనర్లకు భరోసా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను (పీపీఓ) వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా ఐదో తేదీలోగా పెన్షన్ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1948 నుంచి బొగ్గు కార్మికుల సంక్షేమానికి సేవలందిస్తున్న సీఎంపీఎఫ్ఓ సంస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని రియాజ్ అహ్మద్ కోరారు. తీసుకున్న చర్యలను ఈ-మెయిల్ ద్వారా లేదా 0326-2230021, 0326-2223209 నంబర్ల ద్వారా తెలియజేయాలని వినతిపత్రంలో వివరించారు .

ప్రభుత్వ ఆసుపత్రుల ఔషధాల నిల్వకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి









జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 5, (ప్రజాజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) భవనంలో నిల్వ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టగుల్జార్ మార్కెట్ ఏరియాఉఃు వైద్య విధాన పరిషత్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో నిల్వ ఉంచిన ఔషధాలను అవసరాలకు అనుగుణంగా టీవీవీపీ భవనానికి తరలించాలని సూచించారు. ఔషధాల అవసరం, ప్రాధాన్యత ఆధారంగా క్రమబద్ధంగా నిల్వ చేయాలని, వాటి సరఫరా, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు.

ఔషధాలు పాడవకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని, నిల్వ కేంద్రానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, అధికారులు సౌమ్య, వంశీ మాధవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్? గిన్నీస్ రికార్డు విజేత తుర్క అర్షిత్ రెడ్డికి సన్మానం

ఆత్మ రక్షణ క్రమశిక్షణకు మార్షల్ ఆర్ట్స్ హెచ్ఎం జాడి శ్రీనివాస్ వెల్లడి

ఖానాపూర్ నవంబర్ 5(ప్రజాజ్యోతి) : సమాజంలో ఆత్మ రక్షణతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల శారీరక దృఢత్వాన్ని పెంపొందించేది మార్షల్ ఆర్ట్స్ తొనెనని ఖానాపూర్ మండలం మస్కాపూర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ అన్నారు గురువారం పాఠశాల 10వ తరగతి విద్యార్థి, గిన్నిస్ రికార్డు విజేత తుర్క అర్షిత్ రెడ్డి ఆయన తండ్రి ముత్యం రెడ్డి, కరాటే మాస్టర్ ఆరిఫ్ ఖాన్ లను పాఠశాలలో సన్మానించి అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన విద్యార్థితో పాటు కరాటే మాస్టర్ను కొనియాడారు

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి విద్యార్థి, ప్రత్యేకించి బాలబాలికలు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిరంతర సాధన వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఆ పట్టుదలే విద్యార్థులను అసాధ్యాలను సైతం సుసాధ్యం చేసేలా చేస్తుందని చెప్పారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి తుర్క అర్షిత్ రెడ్డిదీనికి ప్రత్యక్ష నిదర్శనమని ప్రశంసించారు. ఇటీవల చెన్నై లో నిర్వహించిన కరాటేలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ సాధించడంతో పాటు, జగిత్యాలలో నిర్వహించిన 1వ రాష్ట్ర స్థాయి కరాటే-కుంగ్-ఫూ పోటీల్లో బంగారు పతకం సాధించి పాఠశాల ఖ్యాతిని, మస్కాపూర్ పేరు ప్రఖ్యాతిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. అర్షిత్ సాధించిన విజయం మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని జాడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

అనంతరం విద్యార్థి తండ్రి ముత్యం రెడ్డి తో పాటు అర్షిత్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందుకోవాలని





ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం నరేందర్, శంకర్, శేఖర్, అంజయ్య, ఇమ్రాన్, శోభారాణి, బాలల రక్షణ అధికారిణి దీప్తి, చందన, సయ్యద్ ఫరాజ్, షఫీ, శ్రీనివాస్, కిషన్ ప్రసాద్, లక్ష్మణ్ రావు, విజయ్, రవి, వినోద్రాజ్, ధర్మయ్య, స్వప్న గంగాధర్, రమేష్,ఝాన్సీ, సృజన తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 5, (ప్రజాజ్యోతి) :

గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, భవన సదుపాయాలు, ఖాళీ స్థలాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపడమే ఆర్ఎస్ఈ టీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని సొంతంగా ఉపాధి పొందేలా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణకు వచ్చే వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్ర మేనేజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఐదో తేదీ వచ్చినా ఖాతాల్లో జమకాని పెన్షన్!

- దీపావళి పండుగ వేళ రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపులు


- ఎస్‌బీఐ ధన్‌బాద్ నోడల్ బ్యాంకు నిర్లక్ష్యంపై పెన్షనర్ల ఆవేదన


మంచిర్యాల, 5, నవంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి బొగ్గు గనుల్లో దశాబ్దాల పాటు కష్టించి పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్ సకాలంలో అందకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షనర్ల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన పెన్షన్, నవంబర్ 5వ తేదీ వచ్చినా ఖాతాల్లో జమ కాకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ ఉండటంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వృద్ధాప్యంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు తమ నెలవారీ పెన్షన్‌పైనే ఆధారపడి మందులు, వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాలు, నిత్యావసరాలను తీర్చుకుంటున్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన వృద్ధులు తమకు రావాల్సిన పెన్షన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు ఇతర జాతీయ బ్యాంకుల్లో పెన్షన్ ఖాతాలు కలిగిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతా వివరాలు, కేవైసీ, జీవన్ ప్రమాణ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ తదితర పత్రాలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ పెన్షన్ జమ కాకపోవడానికి కారణమేమిటని ప్రశ్నిస్తున్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) పెన్షన్ చెల్లింపుల వ్యవస్థలో నోడల్ బ్యాంకుగా వ్యవహరిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ధన్‌బాద్ శాఖ బాధ్యత కీలకమైనది. వివిధ బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ అందేలా సమన్వయం చేయాల్సిన బాధ్యత నోడల్ బ్యాంకుపై ఉంది. అయినప్పటికీ



ప్రతి నెలా ఒకటో తేదీన అందాల్సిన పెన్షన్ ఐదో తేదీ వరకు కూడా ఖాతాల్లో జమ కాకపోవడం నోడల్ బ్యాంకు పనితీరుపై అనేక సందేహాలకు తావిస్తోంది. పెన్షన్ అనేది పదవీ విరమణ చేసిన కార్మికులకు ఎవరూ ఇచ్చే దానం కాదు. అది వారి జీవితకాల శ్రమకు దక్కాల్సిన హక్కు. బొగ్గు గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి వెలుగులు అందించిన కార్మికులు తమ వృద్ధాప్యంలో కనీస పెన్షన్ కోసం, ఇప్పుడు నెలవారీ పెన్షన్ కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. ప్రతి నెలా పెన్షన్‌ను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత తేదీన అన్ని పెన్షనర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పెన్షన్ ఆలస్యానికి గల కారణాలను సీఎంపీఎఫ్, ఎస్‌బీఐ ధన్‌బాద్ నోడల్ బ్యాంకు అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంక్‌తో పాటు ఇతర జాతీయ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న పెన్షనర్లకు కూడా సమాన ప్రాధాన్యతతో సకాలంలో చెల్లింపులు జరపాలని, దీపావళి పండుగకు ముందే పెన్షన్ అందేలా ఎస్‌బీఐ ధన్‌బాద్ నోడల్ బ్యాంకు అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. పండుగ పూట కూడా పెన్షన్ కోసం ఎదురుచూసే దుస్థితి నుంచి వృద్ధ పెన్షనర్లను కాపాడాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, రిటైర్డ్ ఉద్యోగి ఎం.డి. రఫీక్ అహమద్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ





- సాలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం..

- హాజరైన ఏఐఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి

మంచిర్యాల, 5, నవంబర్ (ప్రజాజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందించడమే లక్ష్యంగా సాలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఏఐఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తు కోసం సాలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేస్తున్న సేవలను వివరించారు. ముఖ్యంగా ఉర్దూ మీడియంలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యా సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం, పరీక్షల సన్నద్ధతకు అవసరమైన పుస్తకాలను అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయడమే ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ ఇబ్నీ అఫాన్, సయ్యద్ సోహెల్, సమీర్, బబ్బు, గౌస్, షోయబ్, సయ్యద్ హబీబ్, మహమ్మద్ కలీం ఖాన్, అబ్దుల్ ఖలీద్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం.. ప్రతి విద్యార్థికి మెరుగైన భవిష్యత్తే ఆశయం అని నిర్వాహకులు తెలిపారు.

నవంబర్ 11 నుంచి 15 వరకు 50వ ఉర్సు షరీఫ్



నిర్మల్ టౌన్, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : సూఫీ మహనీయులు హజ్రత్ పీర్ అల్‌హాజ్ షా సాద్‌ఉల్లా అలియాస్ కమాలీ షా రహ్మతుల్లాహి అలైహి వారి 50వ ఉర్సు షరీఫ్ వేడుకలు నవంబర్ 11 నుంచి 15 వరకు నిజామాబాద్‌లోని అహ్మద్‌పురా కాలనీ, కిచియాన్ మసీదు, జమాత్‌ఖానాలో ఘనంగా నిర్వహించనున్నారని నిర్మల్ బాధ్యులు పేర్కొన్నారు. అనంతరం గోడ పత్రులు విడుదల చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ హజ్రత్ షా మజహర్ పాషా వారి పర్యవేక్షణలో ఐదు రోజుల పాటు ఖురాన్ పఠనం, గౌస్-ఏ-ఆజమ్ సభ, మిలాద్-ఉన్-నబీ, ఆధ్యాత్మిక ప్రవచనాలు, అఖిల భారత మన్కబతీ ముషాయిరా, జిక్ర్, దువా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబర్ 15న ఉదయం 9:30 గంటలకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 3 గంటలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈ ఉర్సు షరీఫ్ వేడుకలకు ముస్లిం సోదరులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



జన్నారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : చివరి దశలో ఉన్న వరి పంటకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు రాంపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. చివరి దశలో ఉన్న వరి పంటకు సాగునీటిని నిలిపివేయడం వల్ల వరి పంట పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా సంబంధిత అధికారులు సాగునీటిని సరఫరా చేయాలని లేనియెడల మండల వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడం వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్ కిరణ్ సంఘటన స్థలంకు చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరివింపజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు జాడిగంగాధర్, రైతులు జాడి లచ్చన్న, లక్ష్మణ్, బాలరాజు, జినుగురు మల్లయ్య, బాలయ్య, నగేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



జన్నారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : జన్నారం మండలం చింతగూడ వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ను బుధవారం రాత్రి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు జన్నారం రేంజ్ ఆఫీసర్ ఎస్ కే బాబా ఖాదర్ వలీ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా రోడ్డుపై వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా ఇసుకతో నిండిన టిప్పర్ ను గుర్తించి జన్నారం రేంజ్ కు తరలించామని తెలిపారు. ఇసుక టిప్పర్ రమేష్ రావు, ఓసు మల్లేష్, రాజ మల్లులకు చెందింది గా గుర్తించడం జరిగిందని పై అధికారుల ఆదేశాల మేరకు ఇసుక టిప్పర్ ను అటవీశాఖ కార్యాలయంలో ఉంచడం జరిగిందని ఖాదర్ వలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా చేసిన, నిలువ ఉంచిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడిన హెచ్చరించారు.

రాంపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



జన్నారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ ఆదేశానుసారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రస్తుతం ప్రబలే మలేరియా,డెంగ్యూ ,వైరల్ ఫీవర్ లు, టైఫాయిడ్ డయేరియా,లాంటి వ్యాధులకు గురి కాకుండా ఉండాలంటే ,వ్యక్తిగత పరిశుభ్రత ,పరిసరాల పరిశుభ్రత మరియు నీరు నిలువ ఉండకుండా చూసుకోవడం అలాగే దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్త పడాలని పరిశుభ్రమైన నీరు, పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు, వైద్య పరీక్షలు బీపీ, షుగర్ మరియు రక్త పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూతి రామయ్య, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రమేష్ ,ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త వసంత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరువు కష్టాల్లో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలి.!

పంట రుణాల పునర్వ్యవస్థీకరణతో ఆర్థిక ఉపశమనం.. అర్హులైన ప్రతి రైతుకు కొత్త రుణాలు అందించాలి
తీవ్ర కరువు మండలాల్లో 60 నెలలు.. మధ్యస్థ కరువు మండలాల్లో 36 నెలల వరకు రుణ చెల్లింపు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో): ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. కరువు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని, అర్హులైన ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం రుణ సదుపాయాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయక చర్యలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల మంజూరు తదితర అంశాలపై సమీక్షించారు.





తీవ్ర కరువు మండలాలకు 60 నెలల గడువు..

జిల్లాలో చిన్నచింతకుంట, కోయిలకొండ మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, గండీడ్, హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్, దేవరకద్ర, అడ్డాకుల, మూసాపేట, మహబూబ్‌నగర్ అర్బన్, బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, కౌకుంట్ల మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం కరువు ప్రభావిత ప్రాంతాల్లోని అర్హులైన రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు 12 నెలల మారటోరియంతో కలిపి మొత్తం 60 నెలల వరకు, మధ్యస్థ కరువు మండలాల్లోని రైతులకు 12 నెలల మారటోరియంతో కలిపి మొత్తం 36 నెలల వరకు రుణ చెల్లింపు కాలపరిమితిని పొడిగించే వెసులుబాటు ఉందని వివరించారు.

రుణాల వసూళ్ల పేరుతో రైతులపై ఒత్తిడి వద్దు.!

కరువు పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో రుణాల చెల్లింపుల కోసం వారిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని కలెక్టర్ బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు. రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హులైన రైతులందరికీ రుణ ప్రయోజనాలు అందేలా బ్యాంకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

రైతు వేదికలు, గ్రామసభల ద్వారా అవగాహన కల్పించాలి:

రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణపై మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో బ్యాంకులు అందిస్తున్న సేవలు, రుణ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

వ్యవసాయంతో పాటు ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక రంగాలను ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న రుణ పథకాలు అర్హులకు చేరేలా బ్యాంకు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో బ్యాంకులు, వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖ చారి, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలు

వనపర్తిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ ప్రారంభం
జిల్లా అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, నవంబరు 5 (ప్రజాజ్యోతి): జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు



తెలిపారు. వనపర్తి జిల్లాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలి శాఖ ఏర్పాటు కావడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ శాఖ ద్వారా రైతులు, వ్యాపారులు, మహిళలు, యువతకు మెరుగైన ఆర్థిక సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ, విద్యా, గృహ, వాహన రుణాలతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలను అర్హులైన వారందరికీ సులభంగా అందించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవుతూ సీఎస్ఆర్ నిధుల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని బ్యాంకు ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో బ్యాంకు జోనల్ హెడ్ ఎం. పిచయ్య, రీజినల్ హెడ్ జి.ఎస్. చౌహాన్, వనపర్తి బ్రాంచ్ హెడ్ రామావత్ చంద్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మంచారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ పూర్తి

– రూ.80 కోట్లతో 12 రకాల కోర్టులకు నూతన భవనాలు
– నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, నవంబరు 5 (ప్రజాజ్యోతి): జిల్లా కేంద్రంలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గురువారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిర్మాణ పనులను పరిశీలించి, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను



పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంప్లెక్స్‌లో 12 రకాల కోర్టులకు అవసరమైన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండో అంతస్తుల స్లాబ్ పనులు పూర్తికాగా, మరో అంతస్తు స్లాబ్ పనులు చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో కొన్ని కారణాల వల్ల స్వల్ప జాప్యం జరిగిందన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి కాంప్లెక్స్‌ను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు ఒకే ప్రాంగణంలో మెరుగైన న్యాయసేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థకు ఆధునిక వసతులు కల్పించడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్ఈ, ఈఈ, ఇతర అధికారులు, మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన ప్రముఖ సైకాలజిస్ట్ రాధాకృష్ణారావు నిపుణుల ప్రసంగం

కృష్ణా నవంబర్ 05(ప్రజాజ్యోతి): పీఎంశ్రీ జెడ్పిహెచ్‌ఎస్ కున్సిలో నిర్వహించిన ఎక్స్‌పర్ట్ టాక్ ప్రోగ్రాం లో భాగంగా ప్రముఖ సైకాలజిస్ట్, బి.ఎడ్. కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రాధాకృష్ణారావు విద్యార్థులకు విలువైన మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించే మార్గాలు, సమయపాలన, లక్ష్యసాధన వంటి అంశాలపై చక్కని అవగాహన కల్పించారు. ప్రముఖ వ్యక్తుల జీవితాల్లోని ఆసక్తికర సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించారు. మన జీవితాలను మార్చే శక్తి చదువుకు మాత్రమే ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద సమయం. ఒక్కసారి చేజారిన సమయం తిరిగి రాదు. కాబట్టి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యం వైపు అడుగులు వేయాలి" అని విద్యార్థులకు ఉద్బోధించారు. ఆయన ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు, కొత్త ఆశలకు, ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి. సంతోషి, ఉపాధ్యాయ బృందం పి. నరేందర్, ఉష, ఖాసీం అలీ, సౌమ్య, నర్సిములు, సత్యనారాయణ రెడ్డి, స్వాతి, గీత, ఆరీఫ్, రాధిక, స్మిత, నగేష్, కృష్ణవేణి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక దృష్టి

పోలీస్ లైన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ, ఎంఈఓ
పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించాలి.. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలి: డీఈఓ

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగు



పరిచేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా డీఈఓ, ఎంఈఓలు పోలీస్ లైన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (గవర్నమెంట్ పీఎస్), ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశాల్లో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా అప్పుడప్పుడు పాఠశాలను సందర్శించి పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించాలని సూచించారు.

విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు తప్పనిసరి!

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం వంటి ప్రాథమిక గణిత ప్రక్రియలతో పాటు తెలుగు, ఇంగ్లీషు చదవడం తప్పనిసరిగా రావాలని డీఈఓ సూచించారు. పాఠశాలలో నేర్చుకున్న పాఠాలను ఇంటి వద్ద కూడా పునశ్చరణ చేసుకునేలా తల్లిదండ్రులు ప్రతిరోజూ సాయంత్రం ఒకటి నుంచి రెండు గంటల సమయం కేటాయించి పిల్లలను చదివించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు.. సద్వినియోగం చేసుకోవాలి!

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు



బ్రేక్‌ఫాస్ట్, షూస్, బెల్టులు, టైలు, సాక్సులు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత:

అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు. వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటకు ఉపయోగించే నూనెలు, ఇతర ఆహార పదార్థాలు, వంట సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందికి సూచించారు. వంట చేసేవారు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో సర్పంచ్, కార్యదర్శి ఏకపక్షం.. ఎంపీడీఓ కు ఫిర్యాదు

ఊట్కూర్, నవంబర్ 05(ప్రజాజ్యోతి): నారాయణట జిల్లా ఊట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా,వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఉప సర్పంచ్ మమత మండల ఎంపీడీఓ మేడమ్ కు



వినతిపత్రం సమర్పించారు. గురువారం ఆమె సమర్పించిన వినతిపత్రంలో తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ పంచాయతీకి సంబంధించిన ఏ అంశాన్ని కూడా ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు తెలియజేయడం లేదని, పంచాయతీ బాడీ సమావేశం నిర్వహించకుండానే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తమ సన్నిహితులతో కలిసి ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) పనులు, రామ్స్ పనులు, పనులకు సంబంధించిన సీనియర్ మెట్ల నియామకం విషయంలో పంచాయతీ తీర్మానం లేకుండా, ఎవరి అనుమతి లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ నిబంధనలను తుంగలో తొక్కుతూ వ్యవహరిస్తుండటంతో అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా గత ఏడాది కాలంగా ఈజీఎస్, రామ్స్ పనులకు, సీనియర్ మెట్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, దీంతో పనులు చేసిన కూలీలు, మెట్లు చెల్లింపులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. కావున ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పంచాయతీ పాలన సాగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పిస్తాం

-- నాగర్ కర్నూల్ జిల్లాలో 38,377 మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు
-- 80 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన స్థితిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నమోదుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్నవారి దరఖాస్తులను ఆమోదిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా కల్వకుర్తి..నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం సమర్పించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకెళ్లారు, ఈ ఫిర్యాదును పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలో 12539 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 310 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో 9329 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 128 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో 7041 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 290 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో 9468 మంది పట్టభద్రులు ఓటర్లుగా





నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 698 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని అన్నిటిని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. మొత్తంగా జిల్లాలో 1,426 దరఖాస్తులు పరిశీలనకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలుతీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జనార్దన్ రెడ్డి కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన తదితరులు అధికారులు పాల్గొన్నారు.

నల్ల నరసింహులు పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్

- కడవెండిలో ఘనంగా 33వ వర్ధంతి వేడుకలు



దేవరుప్పుల, నవంబర్ 5(ప్రజాజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజా హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నల్ల నరసింహులు 33వ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని ఆయన స్వగ్రామమైన కడవెండిలో వారి స్మారక స్థూపానికి సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుడు ఏల సోమ సుందర్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల నరసింహులు జీవితం అన్యాయంపై అలుపెరుగని పోరాటానికి, అణగారిన ప్రజల హక్కుల సాధనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రజల విముక్తి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కడవెండి గ్రామ సర్పంచ్ భాషిపాక రాములు, ఉప సర్పంచ్ నక్క రేణుక కొమరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్, సుడిగెల హనుమంతు, పడమటింటి కొమరయ్య, కాశబోయిన యాకన్న, కత్తుల సుధాకర్, భాషిపాక సతీష్, నిలసర్ప ప్రభాకర్, బిట్ల రామసోక్కం, గుమ్మడవెల్లి సోమన్న, నల్ల వీరస్వామి, యాదగిరి, ఉపేందర్, రామచంద్రు, చింతకింది మహేష్, బెల్లి సోమయ్య, యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నేడే చివరి గడువు

- అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి - సనత్ కుమార్ పటేల్



పరకాల, నవంబర్ 05, (ప్రజాజ్యోతి) : పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును నమోదు చేసుకోవాలని పరకాల మండల బిఆర్ ఎస్ ఇన్‌చార్జి, అలియా బాద్ గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ కోరారు. చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండలం పోచారం గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటరు నమోదుకు నవంబర్ 6, 2026 చివరి తేదీ అని తెలిపారు. ఫారం--18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరకాల ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపాలిటీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. అలాగే పరకాల బిఆర్ఎస్ నాయకులను సంప్రదించి కూడా ఓటరు నమోదు ప్రక్రియపై సమాచారం పొందవచ్చని తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ గడువులోగా దరఖాస్తు చేసుకుని ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సనత్ కుమార్ పటేల్ విజ్ఞప్తి చేశారు.పోచారం గ్రామ ఇంచార్జి నరేష్ కుమార్, క్లస్టర్ ఇంచార్జి సురేష్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి



పరకాల, నవంబర్ 05, (ప్రజా జ్యోతి) : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం బుధవారం పరకాల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. 104-పరకాల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్-2026 ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఆర్డీవో వివరించారు. అలాగే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల సీనియర్ సహాయకులు ఎస్.భద్రయ్య, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ తూర్పు 34వ డివిజన్‌లో ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు

మాజీ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పిలుపు



వరంగల్ తూర్పు నవంబర్ 05 ప్రజా జ్యోతి : వరంగల్ తూర్పు నియోజకవర్గం 34వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి మాట్లాడుతూ. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు రేపే (శుక్రవారం) చివరి తేదీ అని గుర్తుచేశారు. అర్హులైన పట్టభద్రులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. డివిజన్ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా మారేలా చూడడమే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిళ్ళ రాజు, ఇట్టబోయిన గణేశ్, సంతోష్, కుడికాల పురుషోత్తం, సల్ల కుమార్,బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పేదల నివాసాల వద్ద మట్టి తవ్వకాలు నిలిపివేయాలి

- తవ్విన గుంతలను పూడ్చి పేద కుటుంబాలకు రక్షణ కల్పించాలి - రాగుల రమేష్



హసన్‌పర్తి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) : హసన్‌పర్తి గ్రామ పరిధిలో పేద కుటుంబాలు నివసిస్తున్న ప్రభుత్వ భూమిలో చేపడుతున్న మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని అక్కడ నివసిస్తున్నాయని తెలిపారు. ఇటీవల చేపట్టిన మట్టి తవ్వకాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.పేదలు నివసించే ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలను నిలిపివేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తవ్విన గుంతలను పూడ్చి రాకపోకలను పునరుద్ధరించాలని, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి రాజుల రాములు, వేలు రజిత, మండల కమిటీ సభ్యులు మంద సుచందర్, వేలు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- కాంగ్రెస్ ముఖ్య నేతలు

- 5 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగ హామీ

బచ్చన్నపేట నవంబర్ 04 (ప్రజా జ్యోతి) : ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు, ముఖ్య నేతలు గురువారం స్వయంగా పరామర్శించారు. ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకవత్ ధన్వంతి తదితరులు బాధిత నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి బాధిత కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు.అనంతరం ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా బాసటగా నిలుస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా:లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు.మృతుని భార్య స్వప్నకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారి పిల్లల పూర్తి విద్యా బాధ్యతలను ప్రభుత్వమే చూసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, బచ్చన్నపేట మండల అధ్యక్షులు మొహమ్మద్ మసూద్, జంగిటివిద్యనాథ్, బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు, దత్తరపు నరేష్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం ప్రారంభం

• విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక కార్యక్రమం

• మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ • కొత్తకొండ పాఠశాలలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ, డీఈఓ








భీమదేవరపల్లి నవంబర్ 05 ప్రజా జ్యోతి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు విద్యాభ్యాసంపై మరింత ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక అల్పాహార కార్యక్రమం గురువారం మండలవ్యాప్తంగా ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఆయా గ్రామాల సర్పంచులు స్వయంగా పాఠశాలలకు చేరుకుని చిన్నారులకు అల్పాహారం వడ్డించారు.ఈ సందర్భంగా కొత్తకొండ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి హాజరై విద్యార్థులకు అల్పాహారం అందించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందితేనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో చదువులో రాణించగలరని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయిలోనే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు అలవడటంతో పాటు పాఠశాలలకు హాజరు శాతం పెరిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కడారి శ్రీనివాస్ మృతిపై గ్రామస్థుల కన్నీరు.. అండగా నిలిచిన తోటి ఆర్ఎంపీల మిత్రబృందం..!



సంగెం, అక్టోబర్ 27 (ప్రజాజ్యోతి) : మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సీనియర్ ఆర్ఎంపి వైద్యులు కడారి శ్రీనివాస్ యాదవ్ మృతి చెందడం పట్ల తోటి ఆర్ఎంపి వైద్యుల సంఘం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. గత 40 సంవత్సరాలుగా రామచంద్రాపురం గ్రామ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ, అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న శ్రీనివాస్ ఇటీవల మానసస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామ ప్రజలు తమకు ఇన్నాళ్లు అండగా ఉన్న వైద్యుడిని కోల్పోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ నేపథ్యంలో మండల ఆర్ఎంపి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన తోటి ఆర్ఎంపి మిత్రబృందం బాధిత కుటుంబానికి మనోధైర్యం చెప్పి, తక్షణ సహాయం కింద రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల ఆర్ఎంపి వైద్యుల సంఘం అధ్యక్షులు గోనె కుమారస్వామి, ఉపాధ్యక్షులు జీలకర్ర వెంకన్న, కార్యదర్శి రాజు, గౌరవ అధ్యక్షులు సురేష్, జి. రవి, ఎస్. సురేష్ మరియు మండల పరిధిలోని ఆర్ఎంపి వైద్యులు, మిత్రబృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం.

బచ్చన్నపేట నవంబర్ 05 (ప్రజా జ్యోతి) : బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఆర్థిక భారం, సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషాదకర సంఘటనపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు.?పరామర్శ అనంతరం చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ, లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి తమ ఫోరం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉద్యమ సమయంలో నాయకుల వెనుక జెండాలు మోసి, పార్టీల కోసం కష్టపడిన ఉద్యమకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు పట్టించుకోకపోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన ఉద్యమకారుల త్యాగాల వల్లనే ఇవాళ నాయకులు పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. కాబట్టి ప్రభుత్వం లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ?ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ, లక్ష్మణ్ గౌడ్ కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ కాకుండా పర్మనెంట్ ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అలాగే కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం, లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ?చివరగా, ఎటువంటి కష్టాలు వచ్చినా ఉద్యమకారులు ఎవరూ కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దని, చావు దేనికీ పరిష్కారం కాదని, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకై పోరాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు డాక్టర్ సీమ శ్రీనివాస్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్, జనగామ జిల్లా అధ్యక్షులు గుజ్జుక రాజు, జనగామ నియోజకవర్గం ఇంచార్జ్ కడింగుల బాలకృష్ణ, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్, జనగామ జిల్లా కార్యదర్శి బోడ రమేష్ నేత, లింగాల గణపురం మండలం బిఆర్ఎస్



పార్టీ అధ్యక్షులు చౌదర్పల్లి శేఖర్, నారగోని లింగమూర్తి, ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రాష్ట్ర కార్యదర్శి కందికట్ల జయ, మహిళా నాయకురాలు గంగా భవాని, జనగామ మండలం అధ్యక్షులు బొల్లం భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు తిప్పారపు ఆనంద్, రాష్ట్ర సెక్రెటరీ సంజీవరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దయానంద్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామల, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, జనగామ పట్టణ అధ్యక్షులు మేకల మహేష్, ఏనుగుతల సోమేశ్వర్, గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా నూతన బాధ్యతల స్వీకరణ



పర్వతగిరి, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : మండల కేంద్రంలోని రామాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రఖండ స్థాయి సమావేశం నిర్వహించి, పర్వతగిరి ప్రఖండ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి, బజరంగ్ దళ్ జిల్లా ప్రభారి మల్యాల రవి హాజరై నూతన కమిటీని ప్రకటించారు. సనాతన ధర్మ పరిరక్షణ, దేవాలయాల సంరక్షణ, దేశ రక్షణ వంటి లక్ష్యాలతో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. విశ్వహిందూ పరిషత్ పర్వతగిరి ప్రఖండ అధ్యక్షులుగా గుడ్ల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా కొప్పు రవి, కార్యదర్శిగా పొలోజు శ్రీనివాస చారి, సహ కార్యదర్శిగా సముద్రాల శ్రీనివాస్, బజరంగ్‌దళ్ కన్వీనర్‌గా పెండ్యాల సాయి శ్రీరామ్, గోరక్ష ప్రముఖ్‌గా బైరి అఖిల్, సత్సంగ్ ప్రముఖ్‌గా శివారెడ్డి, సహ ప్రముఖ్‌గా జూపిడి వెంకటేశ్వర్లు, సేవా ప్రముఖ్‌గా చీధురి తిరుపతి నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులు సంఘం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేస్తూ ధార్మిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

మోడల్ స్కూల్ విద్యార్థిని పోకల మాన్యతకు జాతీయ హ్యాండ్‌బాల్‌లో చోటు



దేవరుప్పుల, నవంబర్ 5 (ప్రజాజ్యోతి): మండలంలోని పెద్దమడూర్ గ్రామానికి చెందిన పోకల రమ రాము దంపతుల ప్రథమ కుమార్తె మాన్యత జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. తెలంగాణ మోడల్ స్కూల్, మద్దూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మాన్యత చిన్న వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు, క్రీడాభిమానులు కొనియాడారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు, గ్రామ ప్రజలు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించి, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.మాన్యత సాధించిన విజయం గ్రామంలోని ఇతర బాలికలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సర్పంచ్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు



పలిమెల నవంబర్ 05 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల గ్రామపంచాయతీ సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు గురువారం రోజున జరిగాయి. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి పర్యవేక్షణలో పారిశుద్ధ పనులలో భాగంగా వీధులలోని మురుగు నీటి కాలువల్లో మురుగు నీరు నిలిచిపోతే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కావున మురుగునీటి పూడిక తొలగించడం తో పాటు తడి చెత్త మరియు పొడిచెత్త సేకరణ తో పాటు పారిశుద్ధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం కలెక్టర్ తనిఖీ

- భద్రతా ఏర్పాట్లు నిరంతరం పర్యవేక్షించాలి

- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, (ప్రజా జ్యోతి): సుబేదారిలోని రెడ్‌క్రాస్ సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాంను సందర్శించిన ఆమె.. ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీల్స్‌ను పరిశీలించారు.

గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లు, పరిసరాల నిర్వహణ, సీసీటీవీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. గోదాం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్‌సింగ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

మాలలకు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం తీవ్ర అన్యాయం

రోస్టర్ విధానాన్ని సవరించకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం

మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి హెచ్చరిక

దేవరకొండ, నవంబర్ 5, (ప్రజా జ్యోతి) :
100 పాయింట్ల రోస్టర్ విధానంలో ఎస్సీ గ్రూప్-3 పరిధిలోని మాల, మాల అనుబంధ కులాలకు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం తీవ్ర అన్యాయమని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కేటగిరీలకు 20వ పాయింట్‌లోపే అవకాశాలు కల్పించి, మాలలకు మాత్రం 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.వర్గీకరణ అనంతరం మాల విద్యార్థులు విద్యాసంస్థల్లో ప్రవేశాల విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారని, ఉద్యోగ నోటిఫికేషన్లలో మాల నిరుద్యోగులకు అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న మాల ఉద్యోగులకు పదోన్నతుల విషయంలోనూ అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

రోస్టర్ పాయింట్ల కేటాయింపులో అసమానతలు:

ప్రస్తుతం 22 పాయింట్ల వరకు ఉన్న రోస్టర్ కేటాయింపులను పరిశీలిస్తే.. ఓసీ కేటగిరీకి 1, 3, 5, 11, 12, 13, 21 పాయింట్లు, ఈడబ్ల్యూఎస్‌కు 9, 17, ఎస్టీకి 8, 15, బీసీ-ఏకు 4, 20, బీసీ-బీకి 10, బీసీ-సీకి 14, బీసీ-డీకి 18, బీసీ-ఈకి 19 పాయింట్లు కేటాయించారని తెలిపారు. ఎస్సీ గ్రూప్-1కు 7వ పాయింట్, ఎస్సీ గ్రూప్-2కు 2, 16వ పాయింట్లు కేటాయించగా, ఎస్సీ గ్రూప్-3 పరిధిలోని మాల, మాల అనుబంధ కులాలకు మాత్రం 22వ పాయింట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ విధానం వల్ల మాల విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతులతో పాటు భవిష్యత్తులో స్థానిక సంస్థలైన వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వంటి రాజకీయ ప్రాతినిధ్య అవకాశాల్లోనూ నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇతర వర్గాల హక్కులను వ్యతిరేకించడం కాదని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు.



మాలలకు న్యాయం చేయాలని శాసనమండలిలో ప్రస్తావించినా పట్టించుకోలేదు:

ఇటీవల జరిగిన వర్షాకాల శాసనసభ సమావేశాల్లో శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం మాల, మాల అనుబంధ కులాలకు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వల్ల విద్యా, ఉద్యోగ, పదోన్నతుల అవకాశాల్లో తీవ్ర నష్టం జరుగుతోందని సభలో ప్రస్తావించిన విషయాన్ని చంద్రమౌళి గుర్తుచేశారు. మాలలకు మెరుగైన రోస్టర్ పాయింట్లు కేటాయించాలని కోరినా ప్రభుత్వం ఆ అంశాన్ని తగిన విధంగా పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ జీవోలు జారీ చేయడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు న్యాయం చేసే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని, అత్యవసర కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి 20 రోస్టర్ పాయింట్ల పరిధిలో మాల, మాల అనుబంధ కులాలకు రెండు పాయింట్లు కేటాయించేలా రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు.

సవరించకపోతే ఎన్నికల్లో తగిన గుణపాఠం :

రోస్టర్ పాయింట్లను వెంటనే సవరించి మాల సమాజానికి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాలలు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తారని హెచ్చరించారు. రాబోయే శాసనమండలి (ఎమ్మెల్సీ), ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మాల ఉద్యోగులు, నిరుద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, ప్రజలంతా ఐక్యంగా నిలిచి ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.మాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, రోస్టర్ విధానంపై అవగాహన పెంచుకుని తమ హక్కుల సాధన కోసం ప్రజా స్వామ్యబద్ధంగా పోరాడాలని బోయిని చంద్రమౌళి పిలుపునిచ్చారు.

తుల్జా భవానీ అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలి

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 5, (ప్రజా జ్యోతి) :
ప్రతి ఒక్కరూ తుల్జా భవానీ అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర



కుమార్ ఆకాంక్షించారు. గురువారం పీఏ పల్లి మండలం పాలపట్టి తండాలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ తుల్జా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆధ్యాత్మికత మనిషిలో సత్ప్రవర్తన, మంచి ఆలోచనలు, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. తుల్జా భవానీ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్లగురి వల్లపు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రెటినేని ముత్యపు రావు, సర్పంచులు రైనబోయిన శ్రీను, కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, దూదిపాల రాజేందర్ రెడ్డి, ఆడెపు నగేష్, రమావత్ కిషన్, హన్మ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి నర్సింహ, మునగాల అంజిరెడ్డి, మద సుధాకర్ గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, వంగల కృష్ణారెడ్డి, గోలి గిరి, ఎర్ర యాదగిరి, కర్నాటి రవికుమార్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలు..

అర్హులకు అన్యాయం

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్,బీజేపీ సర్పంచుల నిరసన

ఆత్మకూర్ ఎం నవంబర్ 5 (ప్రజా జ్యోతి)
మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరిస్తూ బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, గీత కార్మికుల పెన్షన్ల కేటాయింపులో అర్హులైన నిరుపేదలకు



కాకుండా ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని వారు ఆరోపించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆత్మకూర్ సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ....గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ఇష్టానుసారంగా పథకాలు కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై స్థానిక ఎంపీడీఓ ను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని,గీత కార్మికుల పెన్షన్లు కూడా నిజమైన అర్హులకు అందలేదని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్లెపహాడ్ సర్పంచ్ సుంకరి మంజుల, రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్, కాప్రాయిపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి, మోదుగుబావిగూడెం సర్పంచ్ కట్టెకోలా శ్రీహరి, తుక్కాపురం సర్పంచ్ సంగపాక శ్రీవాణి, పుల్లాయిగూడెం సర్పంచ్ నర్రంల రామలింగయ్య తదితర సర్పంచులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి ఈఎస్ఐ డిస్పెన్సరీ ని అందుబాటులోకి తేవాలి

ఎ ఐ ఎఫ్ బి జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము

మిర్యాలగూడ, నవంబర్ 05,(ప్రజాజ్యోతి):
మిర్యాలగూడ పట్టణం లోని ఈఎస్ఐ హాస్పిటల్ గత కొన్ని రోజులుగా మూతపడత ఉందని, పెండింగ్ బకాయిలు చెల్లించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలంటూ గురువారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి



పరిగి రాము ఆధ్వర్యంలో డిస్పెన్సరీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ బిల్డింగ్ లో డిస్పెన్సరీ కేంద్రం కు సంబంధించి అద్దె బకాయిలు 17 లక్షల రూపాయల వరకు ఉండడం తో బిల్డింగ్ యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రంకు తాళాలు వేయడం జరిగింద న్నారు. ఇదే విషయాన్ని అధికారులు తెలుసుకొని మంతనాలు జరిపి నెల రోజుల గడువులో బకాయలు పూర్తిగా చెల్లిస్తాము ఉన్నత అధికారులతో మాట్లాడి అని చెప్పడం జరిగిం దన్నారు. ఇప్పటికే నెల రోజులు పూర్తి అయినప్పటికీ ఆ బకాయిల విషయంలో ఎటువంటి కదలిక రాకపోవడం వలన మళ్లీ బిల్డింగ్ యజమాని బిల్డింగ్ కి తాళం వేయడం జరిగిందని తద్వారా సుమారుగా నిత్యం రెండు నుంచి మూడు వందల మంది కార్మికులు,కర్షకులు, ఉద్యోగస్తులు వారి యొక్క అనారోగ్య సమస్యల పై డిస్పెన్సరీ కేంద్రం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్నటువంటి బకాయాలను పూర్తిస్థాయిలో చెల్లించాలని,ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని. మళ్లీ ఈ సమస్య తలెత్తకుండా రెస్పెన్సరీకి ప్రభుత్వం పక్కా భవనం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో టీయూసీసీ జిల్లా కన్వీనర్ ఎండీ. జలీల్ బాబా, యం.రామకృష్ణ, ఎండీ . నసీర్ బాబా, పరమేశ్వరి,ఎల్లమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుంచి యువత బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బొల్లం

బిఆర్ఎస్ పార్టీ పై విశ్వాసం, కెసిఆర్ పై నమ్మకంతోనే పార్టీలో చేరికలు

యువత ఇదే ఉత్సాహంతో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ టౌన్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి):
కోదాడ పట్టణ పరిధిలోని 18 వ వార్డు నందు గల యువత వినయ్,





మీసాల నాని, రాము, సతీష్, వేణు, మణికంఠ, రాకేష్,పవన్, నవీన్ వివిధ పార్టీలను వీడి బీఆర్ఎస్ పార్టీలో కోదాడ మాజీ శాసనస భ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయిలో విశ్వసనీయత కోల్పోయిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని వాటిని అమలు చేసిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, రైతులు, పేదలు, మహిళలు, యువతకు అండగా నిలిచిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు నిధులు నిలిచిపోయే పరిస్థితి ప్రస్తుతం నెలకొందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఖమ్మం-నల్గొండ- వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఉత్సాహంతో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుటకు కృషి చేయాలని కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి 'ఇందిరమ్మ ఇళ్లు - మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీ'గా నామకరణం

నేడు మంత్రుల చే 560 లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ

కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ సమీక్ష

మిర్యాలగూడ, నవంబర్ 05,(ప్రజాజ్యోతి):
మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నేడు రాష్ట్ర



మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)తన క్యాంపు కార్యాలయం లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రుల రాక కు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, ముఖ్యంగా ఇళ్లను పొందనున్న లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కాలనీలో అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితరసదుపా యాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని



ఎమ్మెల్యే కోరారు. ఇందిరమ్మ ఇళ్లు – మహాత్మ జ్యోతిరావు ఫూలే కాలనీ గా నామకరణం : ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ జిల్లా కలెక్టర్ పి చంద్రశేఖర్ తో మాట్లాడి వెంకటాద్రిపాలెం సమీపంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ కాలనీ కి ' ఇందిరమ్మ ఇళ్లు – మహాత్మ జ్యోతిరావు ఫూలే కాలనీ 'గా నామకరణం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.ఈ సమీక్ష సమావేశంలో మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ జి.రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, విద్యుత్ డి ఇ శ్రీనివాస్ చారి,తోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీని సందర్శించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ స్పెషల్ మానిటర్ సభ్యులు

భువనగిరి,రూరల్ నవంబర్ 5(ప్రజాజ్యోతి)
భువనగిరి మండలములోని బండసోమారము,మరియు రామచంద్ర పురం గ్రామాలలో (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ స్పెషల్



మానిటర్ అనిమేష్ భట్టాచార్య సందర్శించారు. గ్రామ పంచాయతీ నందు త్రాగునీరు కి సంబంధించి 7 రిజిస్టర్లు తనిఖీ చేసినారు, మిషన్ భగీరథ నీరు ఈ విధంగా వస్తుంది, మిషన్ భగీరథ వినియోగంపై సర్పంచి వివరించారు.
ఓ హెచ్,ఎస్ ఆర్ ట్యాంకులలో క్లోరినేషన్ ప్రతి రోజు క్లోరో స్కోప్ టెస్ట్ చేసే ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శి, ఏఈ ఆర్ డబ్ల్యూ ఎస్ వివరించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రం ప్రాథమిక పాఠశాల ను సందర్శించి, మిషన్ భగీరథ,నీటి వినియోగం పై వివరాలను అడిగి,సంతృప్తి వ్యక్తం చేసినారు.ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ కర్ణాకర్ , డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ డి ఈ ఓ బిక్షపతి ఆర్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఈఈ, ప్రశాంత్ ఎంపి ఓ దినకర్,ఎం,ఈ,ఓ,రంగ రాజన్ బండ సోమారం సర్పంచ్ కటిక జంగయ్య రామచంద్రపురం సర్పంచ్ కొలను రవికల,పంచాయతీ కార్యదర్శులు.తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

ఎంఈఓ పానుగోతు ఛత్రునాయక్

గరిడేపల్లి,నవంబర్ 05(ప్రజా జ్యోతి):
విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరిచేందుకు తల్లిదండ్రు లు,ఉపాధ్యా యులు సమన్వ యంతో పనిచేయాలని మండల విద్యాధికారి,జిల్లా పరిషత్



ఉన్న త పాఠశాల ప్రధానోపాధ్యాయు లు పానుగోతు ఛత్రునాయక్ సూచించారు.గురువారం గరిడే పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఆయన అధ్యక్షతన తల్లి దండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీ య సమావేశం (పిటిఎం) నిర్వ హించారు.ఈ సందర్భంగా విద్యా ర్థుల ఎస్ఏ-1 పరీక్షల మార్కులు విద్యా ప్రగతిని ప్రోగ్రెస్ కార్డుల ద్వారా తల్లిదండ్రులకు వివరిం చారు.పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు,పరీ క్షల సన్నద్ధత, మెరుగైన ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యలను వివ రించారు.విద్యార్థుల అభ్యు న్నతికి సంబంధించి తల్లిదండ్రు లు పలు సూచనలు,అభిప్రా యాలను వెల్లడించారు.ప్రతి సమావేశానికి క్రమం తప్పకుండా హాజరవుతూ పాఠశాల అభివృ ద్ధికి సహకరిస్తున్న పదో తరగతి విద్యార్థి జి.చైతన్ తండ్రి జి.వెంక టేశ్వర్లును ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపా ధ్యాయులు జె.సాయిలు,ఉపా ధ్యాయులు,తల్లిదండ్రులు, సీఆర్పీలు రామకృష్ణ,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ చౌరస్తా నుండి నల్గొండ చౌరస్తా వరకు డ్రైనేజిలో డీసిల్టింగ్ పనులు వెంటనే చేపట్టాలి

కౌన్సిలర్ జాలిగం విగ్నేష్

భువనగిరి,నవంబర్ 5(ప్రజాజ్యోతి):
భువనగిరి పట్టణంలో హైదరాబాద్ చౌరస్తా నుండి నల్గొండ చౌరస్తా వరకు గల ప్రధాన డ్రైనేజిలో పేరుకుపోయిన మట్టి, చెత్తను వెంటనే



తొలగించాలని 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ మున్సిపల్ కమిషనర్ ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ డ్రైన్ 9,22, 23,24,25,26,మొత్తం 6 వార్డుల పరిధిలోకి వస్తుందని, ఎన్నో సంవత్సరాల నుండి ఈ డ్రైన్లలో డీసిల్టింగ్ పనులు జరగలేదని తెలిపారు. డ్రైన్లలో విపరీతంగా మట్టి,చెత్త పేరుకుపోవడం వలన మురుగు నీరు సరిగ్గా ప్రవహించడం లేదని, చుట్టుపక్కల ప్రాంతమంతా దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బెడద ఎక్కువై, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మ్యాన్ పవర్ తో వెంటనే డీసిల్టింగ్ పనులు చేపట్టి, పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించాలని ఆయన కోరారు.ప్రజల ఆరోగ్యం కోసం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ గారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

రంగనాయకమ్మకు దైద రవీందర్ నివాళులు

నల్లగొండ నవంబర్ 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
శాలిగౌరారం: భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ చామల రంగనాయకమ్మ మృతి చెందడంతో గురువారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఆమె పార్థివదేహానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, బీరోలు శేఖర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, భూపతి నరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నీటి పొదుపుతోనే భవిష్యత్తుకు భరోసా

★ కేసారంకళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



ఇందల్వాయి(ప్రజా జ్యోతి) నవంబర్. 5 ధర్పల్లి మండల కేసారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, అరితడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించడంతో పాటు నీటి సంరక్షణపై కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు తమ ప్రదర్శనల ద్వారా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు వివరించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సూచనలు, నిర్ణయాలకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని, నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా అరితడి పంటల సాగుపై దృష్టి సారించాలని కళాజాత బృందం సభ్యులు తమ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.3.75 కోట్ల నిధులు మంజూరు

★ ఎంపీ అరవింద్‌కు, బీజేపీ నాయకులకు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు

ఇందల్వాయి:(ప్రజా జ్యోతి) నవంబర్. 5 ఇందల్వాయి మండల పరిధిలోని 10 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3 కోట్ల 75 లక్షల నిధులు మంజూరు చేయించిన ఎంపీ అర్వింద్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కు



మండల అధ్యక్షుడు జి. శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు



తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. బీజేపీ నాయకుల ప్రత్యేక చొరవతోనే మండలంలోని పది గ్రామాలకు అభివృద్ధి నిధులు అందుతున్నాయని పేర్కొన్నారు.

నిధులు మంజూరైన గ్రామాలు, వివరాలు:

1. అంసన్‌పల్లి -- రూ.45 లక్షలు
2. తిర్మన్‌పల్లి -- రూ.75 లక్షలు
3. గన్నారం -- రూ.60 లక్షలు
4. స్టేషన్ తండా -- రూ.15 లక్షలు
5. సిర్నాపల్లి -- రూ.30 లక్షలు
6. గంగారం తండా -- రూ.15 లక్షలు
7. చంద్రాయన్‌పల్లి -- రూ.45 లక్షలు
8. నల్లవెల్లి -- రూ.15 లక్షలు
9. వెంగల్‌పాడు -- రూ.15 లక్షలు
10. జీకే తండా -- రూ.15 లక్షలు

మండలంలోని గ్రామాల అభివృద్ధికి బీజేపీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడటం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కు మండల ప్రజల తరఫున మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

చెట్ల పొదల్లో అప్పుడే పుట్టిన పసికందు

★ గొర్రెల కాపర్ల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

★ శిశువును రక్షించిన పోలీసులు

కామారెడ్డి రూరల్ నవంబర్ 5 ప్రజా జ్యోతి కామారెడ్డి జిల్లాలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. అప్పుడే జన్మించిన పసికందును చెట్ల పొదల్లో వదిలేసి వెళ్లిన ఘటన దొమకొండ మండల గ్రామ శివారులో కలకలం రేపింది. మానవత్వాన్ని ప్రశ్నించే ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే.. దొమకొండ మండలంలోని ఓ గ్రామ శివారులో గొర్రెలు కాస్తున్న కాపర్లకు చెట్ల పొదల నుంచి





పసికందు ఏడుపు వినిపించింది. దీంతో అనుమానం వచ్చిన వారు వెంటనే అక్కడికి వెళ్లి చూడగా, అప్పుడే పుట్టిన శిశువు కనిపించింది. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని శిశువును రక్షించారు. గొర్రెల కాపర్లు సమయస్ఫూర్తితో స్పందించడంతో పసికందుకు ప్రాణాపాయం తప్పింది.

గూడెంలో దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ

★ పశువుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం



కామారెడ్డి రూరల్, నవంబర్ 5 (ప్రజాజ్యోతి) కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు వాటి ఎదుగుదల మెరుగుపడేందుకు నట్టల నివారణ మందులు వేయడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామంలోని దూడలకు పశు వైద్యుల ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులను అందజేశారు. పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా పశువైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి గౌడ్, వెటర్నరీ వైద్యులు ప్రవీణ్, గ్రామ ప్రజలు, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో
విజ్ఞానజ్యోతి హైస్కూల్ విజయభేరి

★ మొత్తం 9 బహుమతులు కైవసం

కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ - 05 - 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో విజ్ఞానజ్యోతి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 9 బహుమతులు సాధించి పాఠశాలకు గర్వ కారణంగా నిలిచారు. మార్చ్‌పాస్ట్, జూనియర్ బాలికల వాలీబాల్, సబ్‌జూనియర్ బాలికల వాలీబాల్, సబ్‌జూనియర్ బాలుర వాలీబాల్‌లో ప్రథమ స్థానాలు సాధించారు. జూనియర్ బాలుర వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, కోకో, కబడ్డీ విభాగాల్లో నాలుగు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థుల విజయానికి పీఈటీ దాత్రిక బాలకుమార్ శిక్షణ, ఉపాధ్యాయుల సహకారం దోహదపడ్డాయని కరస్పాండెంట్ జి. దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె. సౌమ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.



రోడ్డు ప్రమాద బాధితులకు
రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స

★ పీఎం - భారత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: ఎస్ఐ రంజిత్ రెడ్డి

నర్సాపూర్ 5 నవంబర్ (ప్రజా జ్యోతి) పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ పట్టణ ప్రజలకు మరియు వివిధ గ్రామాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం- భారత్ (ప్రైమ్ మినిస్టర్ -- రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ ' హాస్పిటల అస్సుర్డ్ ట్రీట్మెంట్) పథకం గురించి ఎస్ఐ రంజిత్ రెడ్డి ముఖ్యమైన సమాచారం తెలియజేశారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి డబ్బుల కొరత కారణంగా వైద్యం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.ఈ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలు: 1. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అర్హులైన బాధితులకు గరిష్ఠంగా రూ.1,50,000 వరకు నగదు రహిత వైద్య చికిత్స అందుతుంది. 2. ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా 7 రోజుల వరకు ఈ చికిత్స సదుపాయం ఉంటుంది.3. బాధితుడి ఆదాయంతో సంబంధం లేకుండా పథకం నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి ఈ సదుపాయం వర్తిస్తుంది.4. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణ రహదారులు మరియు గ్రామీణ రహదారులపై జరిగిన మోటారు వాహన ప్రమాదాలకు ఈ పథకం వర్తిస్తుంది.5. గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స పొందవచ్చు.



ప్రమాదం జరిగినప్పుడు ప్రజలు చేయాల్సినవి

ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలి. - గాయపడిన వ్యక్తిని వీలైనంత త్వరగా సమీపంలోని పీఎం- భారత్ గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించాలి. ఆసుపత్రి సిబ్బందికి పీఎం -భారత్ పథకం కింద చికిత్స అందించాలని తెలియజేయాలి.ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సర్పంచుల గళం

★ కరెంటు, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి ★ చిమ్నాపూర్‌లో హైస్కూల్, అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలి

రాయికోడ్ నవంబర్ 05 (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో షరీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మండల ప్రత్యేక అధికారి జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా విద్యుత్ అంతరాయం, లోవోల్టేజ్, తాగునీటి కొరత సమస్యలపై సర్పంచులు గళమెత్తారు. రాయికోడ్ గ్రామ సర్పంచ్ రాధా మాట్లాడుతూ.. గ్రామ ప్రధాన మెయిన్ రోడ్డు రహదారి ఇరువైపులా డ్రైనేజీ సమస్య మురుకి కాలువలు నిర్మించాలని, గ్రామంలో తాగునీటి కొరతను పరిష్కరించాలని కోరారు. లోవోల్టేజ్ కారణంగా తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కుసునూరు సర్పంచ్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రైవేటు భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నూతన అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని కోరారు. చిమ్నాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే బోర్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు. అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామలలో లోవోల్టేజ్‌తో పాటు విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు లైన్‌మెన్ల కొరత కారణంగా పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు సరిపడా విద్యుత్ సిబ్బందిని నియమించాలని కోరారు. మహబూత్ పూర్ సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీలో



ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని విన్నవించారు.వివిధ సర్పంచులు మాట్లాడుతూ సమావేశాల్లో సమస్యలను విని నమోదు చేసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎంఈఓ నరసింహులు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల సౌకర్యార్థం చిమ్నాపూర్‌లో హైస్కూల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తహసీల్దార్ ఆశాజ్యోతి మాట్లాడుతూ మండలంలో ఆర్ఐ అధికారి లేకపోవడంతో రెవెన్యూ పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సారిక మాట్లాడుతూ రైతుల పంటల నమోదు ప్రక్రియ ఒక్కొక్కరికి సుమారు ఐదు నిమిషాలు పడుతోందని, ప్రభుత్వం కేటాయించిన సమయం తక్కువగా ఉండటంతో పంటల నమోదు పూర్తి చేయడం కష్టంగా మారుతోందన్నారు. అందువల్ల పంటల నమోదు గడువును పెంచాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ రాయికోడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. మండలం



అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అల్లాదుర్గ్--మెటల్‌కుంట, కంకోల్--రాయికోడ్‌తో పాటు వివిధ గ్రామాల రోడ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కుస్నూర్ వాగు బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. సర్పంచులు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రత్యేక అధికారి జగదీష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ముఖ్యంగా తాగునీరు,విద్యుత్ సమస్యలు తీవ్రతరం అయ్యే అవకాశం ఉందన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సర్పంచులు ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.గ్రామాల్లో అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.తాగునీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయడం లేదా సమీప రైతుల బోర్ల ద్వారా ప్రజలకు నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.మండలంలో తహసీల్దార్ అనుమతి లేకుండా ఎవరూ బోర్లు వేయరాదని,తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

★ మల్లేపల్లిలో విషాద ఘటన ★ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కొండాపూర్, ప్రజా జ్యోతి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన కొండాపూర్ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయిని నాగరాజు (పేరు) రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజుకు గత కొంతకాలంగా భార్య సుజాతతో కుటుంబపరమైన గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య సుజాత సుమారు మూడు సంవత్సరాల క్రితం భర్తను విడిచిపెట్టి గొల్లపల్లిలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. అయితే 20 రోజుల క్రితం కుటుంబ సభ్యులు నచ్చజెప్పడంతో ఆమె తిరిగి భర్త నాగరాజు వద్దకు మల్లేపల్లికి వచ్చింది. అయినప్పటికీ భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో నాగరాజు నిన్న రాత్రి 8 గంటల సమయంలో తాను ఇంట్లో పడుకుంటానని చెప్పి ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు.మృతుడి తండ్రి బోయిని రామచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరి వెల్లడించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు విచారిస్తున్నారు.



చేతికో జెండా.. ఊరికో బండి.. చలో నల్లగొండ!

★ రైతు సమస్యల పరిష్కారానికి జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

★ కరువు మండలాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి ★ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలి

కొండాపూర్, ప్రజా జ్యోతి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న ఏఐకేఎస్ 36వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం కొండాపూర్ మండలంలోని తెర్పాల్ గ్రామంలో జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ.. అకాల వర్షాలు, కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని, కరువు మండలాలకు ప్రత్యేక నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, చట్టాలను రద్దు చేయాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించడంతో పాటు వ్యవసాయ పరికరాలను కూడా రాయితీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, విత్తనాలు, ఎరువుల పంపిణీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు రైతాంగానికి మరింత భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. కరువు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు తగిన చొరవ చూపడం లేదని విమర్శించారు. ఈనెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే ఏఐకేఎస్ 36వ అఖిల భారత మహాసభల్లో జాతీయ స్థాయి రైతు నాయకులు పాల్గొని దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో రైతాంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. కావున కొండాపూర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు వెంకటేశం, మానేయ చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



పశువులకు నట్టల నివారణ మందులు, చర్మవ్యాధి టీకాలు

★ పశువులకు నట్టల నివారణ కార్యక్రమం



కొల్చారం, నవంబర్ 05(ప్రజా జ్యోతి) మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని యనగండ్ల, కిష్టాపూర్ గ్రామాల్లో పశువులకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వాస్ ఆధ్వర్యంలో ఆవులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులతో పాటు చర్మవ్యాధి నివారణ టీకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక వాస్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు, చర్మవ్యాధి నివారణ టీకాలు వేయించడం ద్వారా వివిధ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. రైతులు ప్రభుత్వం చేపడుతున్న పశువైద్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పశుసంపదతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, ప్రభాకర్, మానయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం పోలీస్ స్టేషన్ సందర్శించిన మెదక్ రూరల్ సీఐ కృష్ణమూరి



కొల్చారం, నవంబర్05 (ప్రజా జ్యోతి) మెదక్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. కృష్ణమూర్తి గురువారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల స్థితిగతులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు మరియు సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కేసుల దర్యాప్తులో నాణ్యత పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు.అలాగే శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అహ్మద్ మొహిద్దీన్, డబ్ల్యూ ఏ ఎస్సై లక్ష్మి, సిబ్బంది పీసీ ప్రవీణ్, రాజు , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెట యాదగిరి అకాల మరణం బాధాకరం

★ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి



తొగుట, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రేషన్ డీలర్ నర్మెట యాదగిరి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి విచారం వ్యక్తం చేశారు. గురువారం ఎల్లారెడ్డిపేటలోని యాదగిరి భౌతికకాయానికి స్థానిక బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి జీడిపల్లి రాంరెడ్డి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యాదగిరి మరణం గ్రామానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు నందారం వెంకటేష్ గౌడ్, నాయకులు వేల్పుల స్వామి, సిరినేని గోవర్ధన్ రెడ్డి, ఎండీ కలిముద్దీన్, నంధారం నరేందర్ గౌడ్, బుర్ర నరసింహులు గౌడ్, బుర్ర ఎల్ల గౌడ్, కేబీ భాస్కర్, నీరజ్, పుల్ల మహేష్, గౌరోళ్ల నర్సింలు, ఎండీ మొయినుద్దీన్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

★ సర్పంచ్ బాబాయి కొమురయ్య



మిరుదొడ్డి, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని కాసులాబాద్ గ్రామ సర్పంచ్ బాబాయి కొమురయ్య అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గురువారం మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని సర్పంచ్ బాబాయి కొమురయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు చిన్న వయస్సు నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేలా ప్రీ ప్రైమరీ విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విటల్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ తరగతుల్లో చిన్నారులకు బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి కృత్యాధార బోధన అందించనున్నట్లు తెలిపారు. ఆటపాటలు, వివిధ రకాల బోధన సామగ్రి ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తామని వివరించారు. దీనివల్ల పిల్లల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలు, ఆలోచనా శక్తి, నేర్చుకునే ఆసక్తి పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, కృష్ణమూర్తి, శివకుమార్, వినోద, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మల సత్యం మరణం ఆయన కుటుంబానికి తీరనిలోటు

నంగునూర్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి):- మండల పరిధిలోని అప్పలచెరువు గ్రామా సర్పంచ్ పెద్దమ్మల సత్యం మరణంతో వారి కుటుంబానికి తీరనిలోటు అని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు అప్పలచెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆయన అంతిమయాత్రలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ సర్పంచిగా ప్రజలకు సేవలు అందించి ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను మరువలేని అన్నారు వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటారన్నారు.





ఆరుతడి పంటలు సాగు చేయాలి

★ జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి



దుబ్బాక, నవంబర్ 05(ప్రజా జ్యోతి): ఎల్ నినో ప్రభావం దృష్ట్యా పంటల సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి జె. స్వరూపారాణి అన్నారు. గురువారం నాడు అక్బర్పేట్ భూంపల్లి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు చౌదర్పల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను దుబ్బాక డివిజన్ ఏ. డి . ఏ మల్లయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆరుతడి పంట విత్తనాలైన పొద్దు తిరుగుడు రాయితీపై 87.5 క్వింటాల విత్తనం 3,500 ఎకరాల్లో పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వేరుశనగ విత్తనాలను రాయితీపై 1000 క్వింటాలను 1250 ఎకరాల్లో పంపిణీ చేయడం జరిగింది. మొక్కజొన్న 35.4 క్వింటాళ్ల విత్తనాలను, 45 క్వింటాల శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆరుతడి పంట విత్తనాలైన మొక్కజొన్న పొద్దుతిరుగుడు, జొన్న, శనగ, కూరగాయ విత్తనాలు ఫెర్టిలైజర్ షాపు ప్రతి డీలర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం మన గ్రోమోర్ సెంటర్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏ ఇ ఓ లు రాకేష్, శ్యామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

★ రైతులకు ముందస్తు సమాచారం అందించాలి ★ జిల్లా కలెక్టర్ హైమావతి
★ లింగుపల్లి, చందాపూర్ గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పరిశీలన







మిరుదొడ్డి, తోగుట, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): రైతులు, భూ యజమానుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం మిరుదొడ్డి మండల పరిధిలోని లింగుపల్లి గ్రామంతో పాటు తొగుట మండ పరిధిలోని చందాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ భారతి రీ సర్వే ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మిరుదొడ్డి మండల పరిధిలోని లింగుపల్లి గ్రామంలో మొత్తం 556 ఎకరాల విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 186 ఎకరాల్లో సర్వే పూర్తయిందని, తొగుట మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో 780 ఎకరాల విస్తీర్ణానికి గాను 50 ఎకరాల్లో సర్వే పూర్తయినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ స్థలాలు, ఆబాది భూములు, చెరువులు, కుంటలు, నక్ష బాటల సర్వే పూర్తి చేసిన తర్వాతే పట్టా భూముల సర్వే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పట్టా భూముల సర్వే నిర్వహించడానికి కనీసం రెండు రోజుల ముందుగానే సంబంధిత రైతులు, భూ యజమానులకు సమాచారం అందించాలని జీపీఓలు, సర్వేయర్లను ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా నివసించని భూ యజమానులకు సైతం ముందస్తు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. రీ సర్వే ప్రక్రియను రైతులు, భూ యజమానులు నిశితంగా గమనించాలని, సర్వే సమయంలో ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూమికి సంబంధించిన సర్వే వివరాలను తప్పనిసరిగా భూ యజమానులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఒకే భూ యజమానికి ఒకే ప్రాంతంలో పలు సర్వే నంబర్లలో భూములు ఉన్నట్లయితే భూ భారతి చట్టంలోని నిబంధనల ప్రకారం ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించే అవకాశం ఉంటుందని వివరించారు. రీ సర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు, భూ యజమానులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భూమి కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా సర్వే చేయించుకున్న తర్వాతే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సాదా బైనామా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయా మండలాల తహసీల్దార్లు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, భూ యజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

★ కొండపాక మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి



కొండపాక నవంబరు 5 (ప్రజా జ్యోతి):- కొండపాక మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కొండపాక మండల సర్వసభ్య సమావేశం గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. కొండపాక రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి టి. గోపాలకృష్ణమూర్తిఅధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు తీర్మానాలు చేశారు. అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.నీటి సంరక్షణ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామంలో మ్యాజిక్ ఇంకుడు గుంతలు, ఇంకుడు గుంతలు , బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు వ్యవసాయ క్షేత్ర గుంతల నిర్మాణాలను యుద్ధపాతిపదికన చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు.మండలంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగానికి ఏర్పడిన నష్టాలను పరిగణనలోకి తీసుకుని రైతులను, కౌలు రైతులను ఆదుకునేందుకు కొండపాక మండలాన్ని తక్షణమే 'కరువు మండలంగా' ప్రకటించాలని ప్రభుత్వం సంబంధిత ఉన్నతాధికారులను కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. స్థానిక స్వపరిపాలనలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచుల బాధ్యతలకు తగిన గుర్తింపు నిస్తూ, వారి గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు.అలాగేస్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచులకు ఎమ్మెల్సీ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించి వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరా, వ్యవసాయం, రెవెన్యూ గ్రామీణాభివృద్ధి సంక్షేమ పథక అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలువురు పేర్కొన్నారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దురుపాక శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీవో వెంకటేశ్వర్లు తాహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డి, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వరి సాగుకు తగ్గనున్న ప్రాధాన్యం

★ ఆరుతడి పంటల వైపు రైతుల మొగ్గు! ★ మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగుపై ఆసక్తి..
★ శనగ, కూరగాయల సాగుకు సన్నద్ధం ★ ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పుపై వ్యవసాయ శాఖ సూచనలు









కొండపాక, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, శనగ, పప్పుధాన్యాలు, కూరగాయల సాగువైపు మొగ్గు చూపుతున్నారు.కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లో రైతులు అధికంగా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఈ పంటల సాగు ప్రారంభించారు. అయితే మండలంలోని ఇతర గ్రామాల్లో కోతుల బెడద కారణంగా ఏ పంట సాగు చేయాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. ఆరేపల్లి, వెలికట్ట గ్రామాల రైతులు శనగ సాగువైపు మొగ్గు చూపుతున్నారు. సిరిసినగండ్ల, మర్పడగ, ఖమ్మంపల్లి గ్రామాల్లో కూడా కొంతమేర పొద్దుతిరుగుడు సాగు చేసే అవకాశాలు ఉన్నాయి.కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో రైతులు శనగసాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎల్లాయిగూడ, పిటి వెంకటాపూర్, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో కూరగాయల సాగు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు మండలాల పరిధిలో అక్కడక్కడ వేరుశనగ సాగు చేపట్టేందుకు కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఆరుతడి పంటల సాగుకు వ్యవసాయ శాఖ సూచనలు

కొండపాక, కుకునూరుపల్లి మండలాల వ్యవసాయ అధికారులు గోవిందరాజులు, శివరామకృష్ణ రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, వేరుశనగ, శనగ, బీర్నీస్, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సలహా ఇస్తున్నారు. దీంతో ఈ సీజన్‌లో రెండు మండలాల్లో పంటల సాగు సరళిలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

★ జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి ★ భూంపల్లి రైతు వేదికలో రాయితీ విత్తనాల పంపిణీ తనిఖీ



మిరుదొడ్డి, నవంబర్ 5, (ప్రజా జ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి జె. స్వరూపారాణి సూచించారు. గురువారం అక్బర్ పేట భూంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి వ్యవసాయ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం భూంపల్లి రైతు వేదికలో రాయితీపై రైతులకు అందజేస్తున్న పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ఇప్పటివరకు పొద్దుతిరుగుడు విత్తనాలు 87.5 క్వింటాళ్లను 3,500 ఎకరాలకు సరిపడా, వేరుశనగ విత్తనాలు 1,000 క్వింటాళ్లను 1,250 ఎకరాలకు సరిపడా పంపిణీ చేసినట్లు వివరించారు. అదేవిధంగా మొక్కజొన్న 35.4 క్వింటాళ్లు, శనగ 45 క్వింటాళ్ల విత్తనాలను కూడా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఆరుతడి పంటల విత్తనాలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, జొన్న, శనగతో పాటు కూరగాయల విత్తనాలను ప్రతి ఎరువులు, పురుగుమందుల దుకాణం డీలర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మల్లయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రాకేష్, శ్యామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి ప్రభుత్వ ఆసుపత్రి డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం

రోగుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ కే.మల్లేష్..
శాశ్వత పరిష్కారానికి చర్యలు





పరిగి, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరలోనే శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కే. మల్లేష్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ సమస్య కారణంగా రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి, సమస్యకు గల ప్రధాన కారణాలు, తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచి, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ అలాగే ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు
- బొంగు వెంకటేష్ గౌడ్




ఎల్బీనగర్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి) : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మన్సూరాబాద్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. డంపింగ్ యార్డ్ వద్దకు చేరుకున్న నాయకులు అక్కడి పరిస్థితులను పరిశీలించి, చెత్త నిల్వలు, వ్యర్థ పదార్థాల నిర్వహణ, దుర్వాసన, పొగ, కాలుష్య సమస్యలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు లిబొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ కారణంగా మన్సూరాబాద్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడు తున్న దుర్వాసన, విషపూరిత పొగ, గాలి, నీటి కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు సహా వందలాది కుటుంబాలు అనారోగ్య సమస్యల భయంతో జీవిస్తున్నాయని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే స్పందించి డంపింగ్ యార్డ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని, గాలి, నీటి నాణ్యతను పరీక్షించి పర్యావరణ నిబంధనలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కే. గాంధీ నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు చిప్పలపల్లి యాదగిరి, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు నకిరేకంటి శ్రీకాంత్, చిప్పలపల్లి నరేందర్, చిప్పలపల్లి సురేష్, చేగూరి పరమేష్, జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఖదిజ్ఞాసి వంశీ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు, సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సైదయ్య, జై భారత్ సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది ఖదిజ్ఞాసి గణేష్ గల్లా, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి మధు మాదిగ, జై భారత్ ఎస్సీ, బీసీ, ఎస్టీ పోరాట వేదికల నాయకులు పాండు, గురువయ్య, శ్రీనివాస్ పిట్ల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైబర్ భద్రతపై అవగాహన



హైదరాబాద్, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : డిజిటల్ మోసాల పట్ల విద్యార్థినులను అప్రమత్తం చేసేందుకు బజాజ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో 'నాకౌట్ డిజిటల్ ఫ్రాడ్' కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడెంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సైబర్ క్రైమ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఫిషింగ్ లింకులు, ఓటీపీ, క్యూఆర్ కోడ్, డిజిటల్ అరెస్ట్, నకిలీ పెట్టుబడులు, రుణ ఆఫర్లు, వాట్సాప్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని, మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. విద్యార్థినులు కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అవంతిక, అనితా రాణి, బజాజ్ ఫైనాన్స్ మహబూబ్‌నగర్ బ్రాంచ్ ఏరియా మేనేజర్(ఆర్సీయూ) బి.రాఘవేంద్ర, మేనేజర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులకు అగ్నిమాపక శాఖ సూచనలు





పరిగి, నవంబర్ 05 (ప్రజాజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణపై పరిగి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎన్.సేవ్యా నాయక్ విద్యార్థులకు టపాకాయలు పేల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రత్యేకతను వివరిస్తూ, పండుగను సంతోషంగా జరుపుకోవడంతో పాటు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలు, విద్యుత్ పరికరాలకు దూరంగా టపాకాయలు పేల్చాలని, ఇరుకైన ప్రదేశాల్లో బాణా సంచా కాల్చరాదని తెలిపారు. చిన్నపిల్లలతో పెద్ద టపాకాయలు కాల్చిం చకూడదని, టపాకాయలు పేల్చే సమయంలో కళ్లకు రక్షణగా అద్దాలు, చేతులకు రక్షణ కవచాలు, పాదాలకు పాదరక్షలు ధరించాలని సూచించారు. అలాగే గాజు పాత్రలు లేదా ఇతర పాత్రలను టపాకాయలపై ఉంచి పేల్చడం ప్రమాదకరమని హెచ్చరించారు. దుస్తులకు అనుకోకుండా నిప్పంటుకుంటే భయంతో పరుగెత్తకుండా 'స్టాప్, డ్రాప్, రోల్' (ఆగి, నేలపై పడుకొని, దొర్లడం) విధానాన్ని పాటించాలని వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన ఈ సూచనలను తమ చుట్టుపక్కల వారికి కూడా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. దీపావళి పండుగను ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి పి.భాగ్యలక్ష్మి, అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది పాఠశాలలే

- తల్లిదండ్రులకు భారం కాకూడదనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు
- విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎంర్





తాండూరు నవంబర్ 5 ప్రజాజ్యోతి : ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రోజు తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు(యూనిఫామ్) ఏక రూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడం కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ప్రోత్సాహం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది అన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ అనేది కేవలం దుస్తుల పంపిణీ మాత్రమే కాదు, ఇది సమానత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు.

అదేవిధంగా విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందించడం ద్వారా ఉదయం వేళ పౌష్టికా హారం తీసుకొని, ఉత్సాహంగా తరగ తులకు హాజరై చదువుపై పూర్తి ఏకాగ్రత చూపేందుకు దోహదపడు తుందన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి పోషకాహారంతో పాటు , విద్యాభివృద్ధి ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదవాలన్నారు. దీంతో విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదిగి తమ కళాశాలకు, తల్లిదండ్రులకు, తాండూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రజాక్, కౌన్సిలర్ లు శ్రీకాంత్, శ్రీశైలం,స్థానిక ప్రజా ప్రతినిధులు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి

క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే





తాండూరు, నవంబర్ 5(ప్రజా జ్యోతి) : తాండూర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి క్రీడాకారులకు సూచించారు. గురువారం రోజు తాండూరు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన టిసిఎల్ -2026 టిఆర్ ఎస్ యం ఎ క్రికెట్ లీగ్ పోటీలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేదికపై నుండి ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం పెంచడం కోసం క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి ఆటల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు, ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అంతే కాకుండా ఆటల పోటీలలో గెలుపోటములను సమానంగా స్వీకరించే అలవాటు చేసుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, క్రీడల్లోనూ చదువుల్లోనూ ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. టిసిఎల్ - 2026 టిఆర్ ఎస్ యంఎ క్రికెట్ లీగ్ పోటీలు ఇంత అద్భుతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

- చెన్గేస్ పూర్ ఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు
- ప్రమాణ స్వీకారం చేయించిన దేవదాయశాఖ అధికారులు
- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- శ్రీరాములవారి ప్రాజెక్టును టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



తాండూరు నవంబర్ 5 ప్రజా జ్యోతి : తాండూరు నియోజకవర్గం లోని దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గుర్తు చేశారు. గురువారం రోజు తాండూరు మండలం చెన్గేష్ పూర్ గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయం నూతన చైర్మన్ గా రాఘవపురం శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులుగా కే.కాశప్ప, కురువ మమత, బి.వెంకటయ్య, ప్రధానార్చకులు పట్వారి నాగరాజులచే ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల ప్రకారం దేవాదాయ శాఖ అధికారి నరేందర్ శ్రీ హనుమాన్ దేవాలయం నూతన చైర్మన్గా బాధ్యతలు చేపట్టనున్న చైర్మన్ తో పాటు సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించడంతో పాటు తనవంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనిక సంక్షేమ పథకాలు అందిస్తూనే నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాదినిధులు తీసుకురావడం జరిగింది అన్నారు. అదేవిధంగా జినుగుర్తి గ్రామ సభలోని శ్రీ రాములవారి ప్రాజెక్టు ను నాలుగు కోట్ల నిధులతో టూరిజం హబ్బుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులు కౌసల్య సురేష్ గౌడ్, మాల నర్సమ్మ రావులప్ప, కుర్వ గోవింద్ ల కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కరన్ కోట్ సర్పంచ్ మైల్వార్ రాజకుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సర్పంచులు సుదర్శన్ రెడ్డి, పటేల్ విజయ్ కుమార్, రాం రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, స్థానిక ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఉదయ భాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు రాజు గౌడ్, శ్రీశైలం గౌడ్, వెంకటేష్, కిరణ్ గౌడ్,సురేష్ గౌడ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వీరప్ప, తదితరులు ఉన్నారు.

ప్రభాత్ నగర్ పార్కును కాపాడుతాం.. వాకర్లకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి) : చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్ నగర్ పార్కును గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పక్కనే నిర్మాణంలో ఉన్న టీమ్స్ ఆసుపత్రి యాజమాన్యం పార్కు వద్ద గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలియడంతో వాకర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గేటు ఏర్పాటు చేస్తే వాకింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన సుధీర్‌రెడ్డి పార్కు స్థలాన్ని వాకర్లకే అందుబాటులో ఉంచేలా సంబంధిత అధికారులతో మాట్లాడి గేటు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పార్కు, పోలీస్‌స్టేషన్, వాటర్ ట్యాంక్ తదితర అవసరాల కోసం స్థలం కేటాయిస్తూ జీఓ ఇచ్చారని, ప్రభుత్వం మారిన తర్వాత దానిని పక్కనపెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే హామీపై వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షులు బాల్‌రెడ్డి, సుధాకర్, కడియం మోహన్‌రాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే శ్రీగణేష్





బోయిన్ పల్లి, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : సికింద్రాబాద్ మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందిం చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఆడబిడ్డల వివాహ సమయంలో పేద కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ పథకాల ద్వారా ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతున్నామని అన్నారు.సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఆసుపత్రి ఘటనపై అఖిలపక్షం ఆగ్రహం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



కొందుర్గు, నవంబరు 5 (ప్రజా జ్యోతి) : షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణీ మల్లని రాధ, ఆమె కడుపులోని పసిబిడ్డ మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మాట్లాడారు. న్యాయం కోసం ప్రశ్నించిన బాధిత మహిళ భర్త మల్లని రమేష్‌పై అక్రమ కేసులు బానాయిసి జైలుకు పంపడాన్ని అఖిలపక్షం తీవ్రంగా ఖండించింది. పుట్టబోయే బిడ్డను, భార్యను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వ్యక్తికి అండగా నిలవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ బాధితుడినే నిందితుడిగా మార్చడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యం, సిబ్బంది బాధ్యతారాహిత్యం మరియు పోలీసుల వ్యవహారశైలిపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు.

అఖిలపక్షం ప్రధాన డిమాండ్లు :

1. వైద్యులపై చర్యలు : రాధ మరియు ఆమె శిశువు మృతికి కారణమైన వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే సస్పెండ్ చేయాలి.
2. అక్రమ కేసులపై విచారణ : రమేష్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపడంలో అక్రమంగా వ్యవహరించిన పోలీసు అధికారుల పాత్రపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.
3. రాజకీయ ఒత్తిళ్లపై విచారణ : ఈ ఘటనలో పాలకపక్ష ప్రజాప్రతినిధుల ప్రమేయంపై విచారణ జరిపి, తప్పు చేసిన వారిని చట్టప్రకారం అరెస్టు చేయాలి.
4. కేసుల ఉపసంహరణ : రమేష్‌పై నమోదైన కేసులను నిష్పక్షపాతంగా సమీక్షించి, వెంటనే ఉపసంహరించుకోవాలి.
5. నష్టపరిహారం : బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేసి, ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలి.

బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అఖిలపక్షంగా కలిసికట్టుగా పోరాడతామని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ ఘటనను రాజకీయ కోణంలో చూడకుండా మానవత్వంతో స్పందించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, ప్రేమ్ కుమార్, భీమయ్య; బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీశైలం; టీఆర్పి నాయకులు మీదికేరి రాధాకృష్ణ, దర్గా వెంకటయ్య; బీఎస్పీ ఇన్‌చార్జి జి. బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వృద్ధాశ్రమ నిర్వహణకు ఎన్‌జీఓల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, నవంబర్ 5, ప్రజాజ్యోతి:
జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని టి.ఆర్. నగర్ వద్ద నూతనంగా నిర్మించిన 25 పడకల ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని సహ–నిర్వహణ పద్ధతిలో నిర్వహించేందుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి జిల్లా సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆశ్రమ నిర్వహణ వ్యయంలో 70 శాతం ప్రభుత్వం, 30 శాతం ఎంపికైన ఎన్‌జీఓ భరించాల్సి ఉంటుంది. వృద్ధుల సంక్షేమ రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం, సంబంధిత రిజిస్ట్రేషన్, 12ఏ ధ్రువీకరణ కలిగిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ 13లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జగిత్యాలలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. నవంబర్ 23న దరఖాస్తుల పరిశీలన, నవంబర్ 30న తుది ఎంపిక, ఒప్పందం ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ

మేడిపల్లి,నవంబర్ 5 ప్రజాజ్యోతి:
తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ



కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కొంక వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ (సీడీసీ) చైర్మన్, సభ్యుల చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ మార్గం నర్సిరెడ్డి, కమిటీ సభ్యులు చేపూరి నాగరాజు, నవీన్ రెడ్డి, దశరథ్ రెడ్డితో పాటు అధ్యాపకులు అనీష్, విశ్వప్రసాద్, రాజు, సాయికృష్ణ, రాంబాబు, రాజశేఖర్, అరుణ్, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, నాగేశ్వరి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శానబండలో రేషన్ సేవలు మరింత చేరువ

నూతన రేషన్ షాప్ సబ్ సెంటర్ ప్రారంభం

ఎండపల్లి, నవంబర్ 5, ప్రజా జ్యోతి:
గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలను మరింత చేరువ చేసేందుకు మండలం లోని శానబండ గ్రామంలో గురువారం నూతన రేషన్ షాప్ సబ్ సెంటర్ ను గ్రామ సర్పంచ్





గాధం భాస్కర్, మండల తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,తో కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రేషన్ సబ్ సెంటర్ అందుబాటులోకి రావడంతో ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం కానుందనీ తెలిపారు ,కాగా గ్రామంలో రేషన్ షాప్ సబ్ సెంటర్ ఏర్పాటు పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ అన్వేష్,పంచాయతీ కార్యదర్శి మారుతి,ఉప సర్పంచ్ కడారి రజిత, రేషన్ డీలర్ అంజయ్య, వార్డు సభ్యులు పాక సత్తయ్య, సత్యనారాయణ, గాధం శంకరయ్య, వాళ్ల రాంరెడ్డి, బోధసు రవి, సృజన్, సంతోష్, మల్లేష్, బండి చంద్రయ్య, పాక శ్రీనివాస్, గాధం రాజు, తిరుపతి, భీమన్న, చుక్కరెడ్డి, కనకయ్య, రాజయ్య, మహిళా సభ్యులు పాక విజయ, లత, సరితతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆపదలో ఉద్యోగికి అండగా నిలిచిన పంచాయతీ కార్యదర్శులు

గడ్డం భూమయ్యకు రూ.12 వేల ఆర్థిక సాయం

రాయికల్, నవంబర్ 05 (ప్రజా జ్యోతి):
మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపిస్తూ, ఆపదలో ఉన్న తోటి ఉద్యోగికి అండగా నిలిచి రాయికల్ మండల పంచాయతీ కార్యదర్శులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రామాజీపేట గ్రామ పంచాయతీలో యంపిడబ్ల్యూ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గడ్డం భూమయ్య విద్యుత్ ప్రమాదానికి గురై ప్రస్తుతం చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాయికల్ మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు మానవతా దృక్పథంతో స్పందించారు. భూమయ్య వైద్య ఖర్చులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛందంగా తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ క్రమంలో సమిష్టిగా సేకరించిన రూ.12,000/- నగదును భూమయ్య గారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆపద సమయంలో పదవులు, హోదాలు, భేదాలు పక్కనపెట్టి తోటి ఉద్యోగి కష్టంలో పాలుపంచుకోవడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని పలువురు అభినందిస్తున్నారు. తోటి ఉద్యోగి కష్టాన్ని తమ కష్టంగా భావించి, ఆర్థికంగా అండగా నిలిచిన రాయికల్ మండల పంచాయతీ కార్యదర్శులందరికీ భూమయ్య కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారి సేవా భావం, ఐక్యత, మానవతా దృక్పథం ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ఉందని పలువురు అభినందిస్తున్నారు.



నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు

సహజ వ్యవసాయం, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన

బుగ్గారం, నవంబర్ 5 (ప్రజాజ్యోతి):
నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సహజ వ్యవసాయ పద్ధతులను పాటించినప్పుడే భవిష్యత్తులో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. బుగ్గారం మండలం వెల్గొండ గ్రామంలో గురువారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించి రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయం, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ పీడీపీడీ సుధాకర్ మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు, పంట మార్పిడి, పంట అవశేషాలను భూమిలో కలపడం వంటి పద్ధతులతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం వంటి ప్రకృతి సిద్ధమైన ఎరువులను వినియోగించాలని తెలిపారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి పర్యావరణాన్ని, నేలలోని జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి అక్షిత మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవడంతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలన్నారు. వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడం, పొలాల గట్లను పటిష్టం చేయడం, నేలపై పంట అవశేషాలతో కప్పడం, నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి నీలం నందిని, వ్యవసాయ విస్తరణ అధికారి నవీద్, పంచాయతీ కార్యదర్శి సతీష్, రైతులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!

- యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి
- తక్కువ నీటితో పండే కూరగాయల సాగుకు ప్రోత్సాహం
- రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా ఉచితంగా విత్తన కిట్లు
- ఒక్కో కిట్ విలువ రూ.1,000.. ఏడు రకాల విత్తనాలు

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 05 ప్రజా జ్యోతి:
ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా వరి సాగు చేపట్టి ఇబ్బందులు పడే బదులు.. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరారు. రానున్న యాసంగి 2026–27 సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, సాగునీటి ప్రాజెక్టుల నుంచి వ్యవసాయ అవసరాలకు నీటి విడుదలపై అనిశ్చితి నెలకొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోందన్నారు.
ఈ నేపథ్యంలో భూములను బీడుగా వదిలేయడం లేదా తక్కువ నీటి అవసరమయ్యే కూరగాయలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులను ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ (ఎన్ఎస్సీ) ద్వారా ఉచితంగా కూరగాయల విత్తన కిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.



ఒక్కో కిట్‌లో ఏడు రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయని, ఇవి పది గుంటల విస్తీర్ణంలో సాగు చేసుకోవడానికి సరిపోతాయని తెలిపారు. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.వెయ్యి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను సంబంధిత మండల ఉద్యానవన అధికారులు లేదా ఉద్యానవన విస్తరణ అధికారులకు అందజేయాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ కోరారు.

ర్యాకల్ దేవ్ పల్లిలో జల జలసిరిపై రైతులకు అవగాహన సదస్సు

నీటి వనరులను సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించుకోవాలి
గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

ఎలిగేడు నవంబర్05(ప్రజాజ్యోతి):
మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో జల జలసిరి కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.



ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వ్యవసాయానికి నీరు ఎంతో కీలకమని, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసి పట్టడం, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు, నీటి నిల్వ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, అవసరానికి అనుగుణంగా పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామంలో నీటి సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి ఉపయోగించుకున్నప్పుడే రైతులకు మేలు జరగడంతో పాటు గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే అశోక్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ,నవంబర్,5:ప్రజాజ్యోతి.



వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలోని శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్, వేములవాడ శాసన సభ్యులు కు

ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయాల్లో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు.



ఆపద సమయంలో అండగా.. బాడీ ఫ్రీజర్ వితరణ

పాతగూడూరు గ్రామ పంచాయతీకి రూ.80 వేల విలువైన పరికరం అందజేత

ఎండపల్లి, నవంబర్ 5 ప్రజా జ్యోతి:
గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు



అంతిమ దర్శనం చేసుకునేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మండలంలోని పాతగూడూరుకు చెందిన సుంకిశేలా శ్యామసుందర్ రావు ఉదారత చాటుకున్నారు. తన తండ్రి సుంకిశేల నారాయణరావు స్వగ్రామమైన పాతగూడూరు గ్రామ ప్రజల సౌకర్యార్థం రూ.80 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీకి వితరణగా గ్రామ పాలకవర్గం, గ్రామస్థుల సమక్షంలో ఈ బాడీ ఫ్రీజర్‌ను అందించారు. గ్రామంలో విషాద ఘటనలు చోటుచేసుకున్న సమయంలో మృతుల బంధువులకు ఉపయోగపడేలా చేసిన ఈ సహకారంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక అవసరాన్ని గుర్తించి ముందుకొచ్చిన శ్యామసుందర్ రావు కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ మేడిపల్లి సత్యనారాయణ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించాలి

వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్ణయం

జగిత్యాల, నవంబర్ 5, ప్రజాజ్యోతి:
యువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో



కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. నవంబర్ 2 నుంచి 18 వరకు పాఠశాల, కళాశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతను బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమాల లక్ష్యమన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు రైతులకు ఎలిని నో ప్రభావం పై అవగాహన సదస్సు నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి ఎం ఉమాపతి

ఎలిగేడు నవంబర్ 05 (ప్రజా జ్యోతి):
మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి, రాములపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో



గురువారం రైతు ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఉమాపతి మాట్లాడుతూ ఏలినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని పంట మార్పిడి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మద్దెల రమాదేవి సంపత్, సిద్ధి తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్యాల రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం కోసం కృషి

ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, నవంబర్ 5 (ప్రజాజ్యోతి):
విద్యార్థులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యం చెప్పారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ సునీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. హాస్టల్‌లో డైనేజీ సౌకర్యం కల్పించడం, విద్యార్థుల కోసం వేడి నీటి గీజర్లు ఏర్పాటు చేయడం, అవసరాల నిమిత్తం టెంట్ అందించడం, శాశ్వత భవనం నిర్మించాలని కమిటీ సభ్యులు కోరారు. విద్యార్థుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, వారి సౌకర్యార్థం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్య పరిష్కారంతో పాటు గీజర్లు, టెంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని, హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మాణానికి కూడా కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, వారి భవిష్యత్తు తనకు అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కు పేరెంట్స్ కమిటీ చైర్మన్ సునీల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి , వైస్ ప్రిన్సిపాల్ దీప్తి పేరెంట్స్ కమిటీ సభ్యులు, పిట్ట భూమయ్య, కొత్తూరి సురేష్, ఉప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బేతుపల్లి చెరువును సందర్శించిన మంత్రి తుమ్మల

- బేతుపల్లి చెరువు కథ సుఖాంతం అందరూ సురక్షితం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ ఫైర్ సిబ్బందికి నా ప్రత్యేక ధన్యవాదాలు
- సంఘటనను పర్యవేక్షించిన ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులకు అభినందనలు



సత్తుపల్లి నవంబర్05(ప్రజా జ్యోతి) తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఉదయం సత్తుపల్లి మండల పరిధిలోని బేతుపల్లి చెరువు వద్ద ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ మరియు ఫైర్ సిబ్బందిని కలుసుకొని వారిని అభినందించారు. బుధవారం సాయంత్రం ఎనిమిది మంది మత్స్యకారులు చిక్కుకొనగా, వారిని రక్షించేందుకు వెళ్లిన ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాల పడవ బోల్తా పడిన సంఘటన విధితమే,వాళ్లందరిని



క్షేమంగా ఒడ్డుకి చేర్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను,ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను ,ఫైర్స్ సిబ్బందిని మంత్రి తుమ్మల అభినందించారు. సాయంత్రం నుంచి బేతుపల్లి చెరువు వద్ద ఉండి ఈ దుర్ఘటనను పర్యవేక్షించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ మంత్రి తన ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాత్రి వేళ అయినా చిమ్మ చీకటిలో ఈ 18 మంది సురక్షితంగా బయటికి రావటం ఆనందాన్ని కలిగించిందని మంత్రి తుమ్మల తెలిపారు. జరిగిన సంఘటన నిన్న సాయంత్రం నుంచి మంత్రి తుమ్మల స్వయంగా పర్యవేక్షించి అధికారులకు మరియు స్థానిక శాసన సభ్యురాలు తో మంత్రి తుమ్మల నిరంతరం పర్యవేక్షించారు.

రేగుళ్ళ - గొడుగుబండ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- 5 ఏళ్లుగా గుంతల్లోనే ప్రయాణం
- రోడ్డు కాదు.. చెరువు.. రేగుళ్ళ గ్రామస్తుల నిత్య నరకం
- అధికారులకు కనిపించని రేగుళ్ళ రోడ్డు.. ప్రమాదాల్లో విలవిల్లాడుతున్న ప్రజలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / కరకగూడెం. నవంబర్ 5, (ప్రజాజ్యోతి) : -రేగుళ్ళ నుండి గొడుగుబండ వెళ్లే రహదారికి మోక్షమెప్పుడో తెలియడం లేదు. ఐదు సంవత్సరాలుగా ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. వర్షం పడితే చాలు.. రోడ్డు చెరువును తలపిస్తోంది. ద్విచక్ర వాహనదారులు పడిపోవడం, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు నరకం అనుభవించడం నిత్యకృత్యంగా మారింది. అధికారులు మాత్రం ఇంకా స్పందించకపోవడం తో గ్రామస్తుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. కరకగూడెం మండలం తుమ్మలగూడెం పంచాయితీ పరిధిలోని రేగుళ్ళ గ్రామ ప్రజలు గత ఐదు సంవత్సరాలుగా రహదారి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేగుళ్ళ నుండి గొడుగుబండ వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే ఆ గుంతల్లో నీరు నిలిచి రోడ్డు ఎక్కడుందో.. చెరువు ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. నిత్యం ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగించే గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి అనేకసార్లు ప్రమాదాలకు గురయ్యారు. చిన్నపాటి గాయాల నుండి ఎముకలు విరిగేంత ప్రమాదాలు జరిగినా అధికారుల్లో చలనం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే మహిళలు, వృద్ధులు ఈ రోడ్డుపై నడవాలంటేనే భయపడుతున్న పరిస్థితి ఉంది. వర్షాకాలంలో అయితే బురదలో కూరుకుపోయి నడవలేని దుస్థితి ఏర్పడుతోంది. ఐదేళ్లుగా సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడం పై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస మౌలిక సదుపాయమైన రోడ్డు కల్పించడం లో ఇంత జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే రాగమయి ప్రయత్నంతో అందరూ సేఫ్

- ఎస్డిఆర్ఎఫ్ బృందం కోసం తెల్లవార్లు గాలింపు
- ఉత్కంఠ పరిస్థితులు.. క్షణక్షణాన భయం
- ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు ప్రశంసలు అందించిన ప్రజలు













సత్తుపల్లి నవంబర్05(ప్రజా జ్యోతి) క్షణ,క్షణాన ఉత్కంఠం ఏ క్షణాన ఏమి వార్త వినాల్సి వస్తుందని జనాల్లో భయాందోళన, దారులన్నీ బేతుపల్లి చెరువు దగ్గరికి ఉన్నాయి. సత్తుపల్లి, పాకల గూడెం, గంగారం, బేతుపల్లి, నాచారం, రామానగరం దగ్గర దగ్గర ప్రాంతాలు ప్రజలందరూ తెల్లవారులు చెరువు దగ్గరే ఉండటం,ఏమి జరుగుతుందని భయంతో ఉండటం అలాంటి వాతావరణం నెలకొన్నది. అసలు విషయం ఏమిటంటే మురసు తుఫాను ప్రభావంతో విపరీతంగా బేతుపల్లి చెరువులోకి వరద వచ్చింది. చెరువులో ఉన్న చేపలు ఎక్కడ బయటకు పోతాయో అని, భయంతోటి ఐదుగురు మత్స్యకారులు వలలు తీసుకొని చేపలు బయటికి వెళ్లకుండా ఉండేందుకు అలుగు దగ్గరికి వెళ్లారు. వాళ్లను బయటికి తీసుకొచ్చేందుకు,మరో రెండు తెప్పలు వేసుకుని ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. మొత్తం ఏడుగురు సభ్యులు అక్కడ చిక్కుకున్నారు. వెళ్లిన తర్వాత విపరీతంగా వరద పెరగడంతో వాళ్ళు అక్కడే చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకొని,పై అధికారులకు సమాచారం అందించడంతో ఎస్.డి.ఆర్. ఎఫ్ 11 మంది సభ్యులను తెప్పించారు. వెంటనే 2 బోట్ల సహాయంతో వారి దగ్గరకు చేరుకున్నారు. ముందుగా ముగ్గురు వ్యక్తులను బయటికి తీసుకొచ్చారు. మిగిలిన నలుగురు కోసం తిరిగి వెళ్లే క్రమంలో వరద ఉధృతధాటికే బోట్లు గల్లంతయి 11 మంది ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం వరద తాకిడికి కొట్టుకుపోయారు. కొంతమేరకు ఈదుకుంటూ వెళ్లి, చెట్లను పట్టుకొని అక్కడ ఉండి, వాళ్ల దగ్గర విజిల్ ,సెల్ ఫోన్ లొకేషన్ సహాయంతోటి మిగిలిన వారికి సమాచారం అందించారు. సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఎట్టి పరిస్థితిలోనూ ప్రాణ నష్టం జరగకూడదని, ముమ్మర చర్యలు చేపట్టారు. ముందుగా ఐదుగురు సభ్యులను క్షేమంగా ఒడ్డుకు చేర్చిన తర్వాత, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందం కోసం గట్టి ప్రయత్నం చేయడంతో తెల్లవారిలోపులోనే అందరూ సురక్షితంగా క్షేమంగా చేరుకున్నారు. ఈ విధంగా ఎమ్మెల్యే చేసిన కష్టానికి ప్రయత్నించిన ఫలితానికి ఒక్క ప్రాణం నష్టం కూడా జరగకపోవడం అదృష్టం భావించి, పక్కన గ్రామాల ప్రజల మొత్తం ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఒకపక్క వేశ్య కాంతల చెరువు అధిక వరద తాకిడికి చెరువు తెగిపోతే, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిగా కొట్టుకు పోతాయని, ఆ డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న అందర్నీ ట్రాక్టర్ల ,కార్ల సహాయం తో అందరిని సురక్షిత ప్రాంతానికి తరలించి, వారికి కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేయటం ఒక ఎత్తు అయితే, బేతుపల్లి చెరువు సంచలనం రాష్ట్రంలోనే ఆ విధంగా ఉండటం, ఏమి జరిగినా ఒక్క ప్రాణం నష్టం జరగకపోవడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అకాల వర్షాలతో అన్నదాతకు కోలుకోలేని దెబ్బ

- కల్లూరు మండలంలో పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్





కల్లూరు, నవంబర్ 05 : ప్రజా జ్యోతి ఎల్ నినో ప్రభావంతో ఇప్పటికే వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగానికి మురసు తుఫాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో వేలాది ఎకరాల్లో రైతుల కష్టపడి సాగు చేసిన వరి పంట కోతకు వచ్చి ధాన్యం చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గురువారం కల్లూరు మండలంలో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన సన్న రకాలు మరియు బీపీటి – 5204 రకం వరిని రైతులు అధికంగా సాగు చేయగా, పంట కోత దశలోనే వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరి వరి పంట నేలకొరిగింది. కోత కోసి ఆరబెట్టిన ధాన్యం సైతం వర్షాలకు తడిసిపోయి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతుల తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. పక్కతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మురసు తుఫాను ప్రభావంతో కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, ఏంసూరు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేసి రైతులను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో పక్కతి ప్రకోపంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, గ్రామస్థాయిలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించాలని డిమాండ్ చేశారు. తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరించకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజులు తరబడి నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. పదివేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అర్హులైన రైతులకు ఆ హామీ మేరకు పరిహారం అందలేదని గుర్తు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పారదర్శకంగా పంట నష్టం అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం ఒకవైపు, అకాల వర్షాలు మరోవైపు రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయని పేర్కొంటూ, ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గం లోని పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా తక్షణమే చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కట్ట అజయ్ కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, నాయకులు పెద్ద బోయిన మల్లేశ్వరరావు, పురపాలక కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, కనపర్తి శ్యామల రాజ్ కుమార్, ఇంతియాజ్, ధారా రమేష్, మేకల కృష్ణ, దేవరపల్లి భాస్కరరావు, షేక్ కమ్లి, ఉబ్బన వెంకటరత్నం, కొరకొప్పు ప్రసాద్ మోర్తాల పిచ్చిరెడ్డి కళ్యాణ్ కిషోర్, ఖమ్మం పాటి రమేష్, ఎనుముల శివ, మంచాల కృష్ణ, చింతలపూడి కృష్ణ, వార్డు సభ్యుడు కొత్తపల్లి వెంకటి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖమ్మంపాటి పుల్లారావు, సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో మెడికల్ కారెల్..!

- డాక్టర్ స్లిప్ లేకుండానే టాబ్లెట్ల దందా...
- అర్హత లేని వారి చేతిలో ప్రజల ప్రాణాలు
- ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు..!
- ప్రిస్క్రిప్షన్ లేకపోయినా పర్లేదు... డబ్బుంటే చాలు... మందుల షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వైద్యాధికారుల నిద్ర రోగుల పాలిట శాపంగా మారిన నకిలీ మందుల దందా..!
- ఏ కంపెనీ మందో తెలియదు, ఏ డోసో తెలియదు అయినా అంటగడుతున్న మెడికల్ షాపులు...
- మందుల వ్యాపారం ప్రజల ప్రాణాలను తీస్తోందా...?



డాక్టర్ రాసిన చీటీ లేకుండానే మందులు అమ్మే దందా మణుగూరు మండలంలో రెచ్చిపోతోంది. అర్హత లేని కొందరు వ్యక్తులు సైతం మెడికల్ షాపులు తెరిచి డాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. లైసెన్స్ ఒకరిదైతే షాపు నడిపేది మరొకరు కావడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. రకరకాల కంపెనీల మందులు తెప్పించి రోగం ఏమిటో తెలియకుండానే రోగులకు అంటగడుతున్నారు. కొందరు వ్యాపారులు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి ప్రమాదకర మందులను సైతం ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. దీంతో చిన్న జ్వరానికి వెళ్లిన రోగి పెద్ద జబ్బుతో తిరిగి వస్తున్న దుస్థితి నెలకొంది. నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా, జిల్లా వైద్యాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు లేకపోవడంతో అక్రమ దందా మరింత పెరిగిపోతోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ మెడికల్ మాఫియాపై వెంటనే కొరడా ఝుళిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

మణుగూరు, నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మందుల షాపులే ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లోనూ పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు వెలిశాయి. ఫార్మసిస్ట్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే షాపు నిర్వహించాలన్న నిబంధనను తుంగలో తొక్కారు. లైసెన్స్ పేరు ఒకరిదైతే, కౌంటర్ లో కూర్చుని మందులు ఇచ్చేది మరొకరుగా ఉన్నారు. కొన్ని చోట్ల అసలు అర్హతే లేని వ్యక్తులు సైతం రోగులను పరీక్షించి మందులు రాసి ఇవ్వడం గమనార్హం.

మెడికల్ షాపుల మాఫియాకు కౌంట్ డౌన్... ఇక దాడులే... లైసెన్స్‌లు రద్దే..!

డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్ముతున్నారా..? ఇక మీ ఆట కట్టినట్టే. అర్హత లేకుండా షాపు ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారా..? ఇక మీ లైసెన్స్‌లు రద్దయినట్టే. మణుగూరు మండలంలో రెచ్చిపోతున్న మెడికల్ దందాపై ఇక ఉపేక్షించేది లేదని తెలుస్తోంది. లైసెన్స్ ఒకరిది, నడిపేది మరొకరు కావడం ఇక్కడ ఫ్యాషన్ అయిపోయింది. రకరకాల కంపెనీల మందులను తెప్పించి రోగులకు అంటగడుతున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకపై ప్రతి అక్రమ షాపుపై దాడులు, సీజ్, కేసులు తప్పవని స్థాని కులు హెచ్చ రిస్తున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందు అమ్మితే జైలే... డ్రగ్ అధికారుల ఉదాసీనతపై హైకోర్టుకు వెళ్తాం..!

ప్రిస్క్రిప్షన్ అడగకుండా మందులు అమ్మడం మణుగూరులో మామూలైపోయింది. నొప్పికి, నిద్రకు, దగ్గుకు అంటూ షెడ్యూల్ మందులను సైతం



ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. యాంటీబయాటిక్స్ విచ్చలవిడిగా వాడటం వల్ల రోగ నిరోధక శక్తి దెబ్బతింటోంది. చిన్న జ్వరానికి వెళ్లిన రోగి పెద్ద జబ్బుతో తిరిగి వస్తున్నాడు. ఇంత జరుగుతున్నా డ్రగ్ ఇన్ స్పెక్టర్లు ఒక్కసారి కూడా తనిఖీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు కదలకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

అర్హత లేని నకిలీ డాక్టర్ల ఆట కట్టు... లేకపోతే కదిలేది ప్రజా ఉద్యమమే..!

కౌంటర్ లో కూర్చున్న వ్యక్తే డాక్టర్ అవతారం ఎత్తుతున్నాడు. రోగం ఏమిటో తెలియకుండానే మందులు రాసి ఇచ్చేస్తున్నాడు. మందుల మోతాదు తప్పితే కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయని వైద్యులు చెబుతున్నా వినేవారు లేరు. డబ్బు కోసం ఏ కంపెనీ మందైనా సరే రోగికి అంటగడుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ నకిలీ షాపులపై వెంటనే కొరడా ఝుళిపించాలని ప్రజలు ముక్త కంఠంతో ఆరోపిస్తున్నారు. లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని తెగేసి చెబుతున్నారు.

రేపటినుండి సీఎం కొడంగల్ పర్యటన

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభించనున్నారు. నవంబర్ 7వ తేదీన ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి హకీంపేటకు చేరుకుని మెగా రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. అనంతరం ప్రదర్శన స్టాళ్లను సందర్శించి ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖిలో పాల్గొంటారు. పారిశ్రామికవేత్తలతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఈ రైతుమేళాలో 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, సాగు పరికరాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలను ప్రదర్శించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సాంకేతిక సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటలు, మార్కెటింగ్ అవకాశాలు, పంటల విలువ ఆధారిత ఉత్పత్తులపై సీఎం రేవంత్ రెడ్డి అవగాహన కల్పించనున్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా చర్చించనున్నారు. తొలి రోజు వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి సుమారు 7,500 మంది రైతులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఇక రెండో రోజైన నవంబర్ 8వ తేదీన సీఎం రేవంత్ స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళల పాత్ర, వారి ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై



చర్చించనున్నారు. అనంతరం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. అదే రోజు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను, రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభిస్తారు. కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ భవనాలు కూడా ప్రారంభోత్సవానికి రెడీ అయ్యాయి. దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని సీఎం రేవంత్ ప్రారంభిస్తారు. కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియం, దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో చేపట్టనున్న ప్రధాన ప్రాజెక్టుల్లో కొత్వాల్‌గూడ నుంచి నాచారం వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 ఒకటి. సుమారు రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్వాల్‌గూడ నుంచి నాచారం మీదుగా నేషనల్ హైవే 167ఎన్ వరకు ఈ రహదారి అనుసంధానం కల్పించనుంది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్‌ఐఎస్) రెండో దశ పనులకు రూ.2,100 కోట్లతో సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. అలాగే ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో రూ.41.83 కోట్లతో ఆధునిక బస్టాండ్ల నిర్మాణం, మద్దూరులో రూ.20 కోట్లతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మరో రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం ఏర్పాటు చేయనున్నారు. విద్యారంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, కొడంగల్‌లో రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. రహదారుల అభివృద్ధికి రూ.59.30 కోట్లతో పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం కూడా ప్రతిపాదిత పనుల్లో ఉంది. ఈ ప్రాజెక్టులన్నీ కలిపి మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, సంబంధిత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మరోవైపు రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను సీఎం ప్రారంభించనున్నారు. మూడు రోజుల పర్యటనలో చివరి రోజైన నవంబర్ 9వ తేదీన హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఈ సభకు వికారాబాద్, నారాయణపేటతో పాటు రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

పార్లమెంటుకు రండి చర్చిద్దాం..

ఎస్ఐఆర్‌పై సమావేశాలకు సిద్ధం రాహుల్‌కు అమిత్ షా సవాల్!

న్యూఢిల్లీ, నవంబర్ 05(ప్రజాజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ విసరడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుండా పార్లమెంటులో చర్చకు రావాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. హర్యానాలోని కర్నాల్‌లో గురువారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో చర్చ కావాలంటే ఆయనకు లేఖ రాయాలని రాహుల్‌కు సూచించారు. ఎస్ఐఆర్‌పై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, పార్లమెంటుకు వచ్చి తన వాదనలు వినిపించాలని సవాల్ విసిరారు. దేశ వ్యతిరేకులు ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల స్వరూపం ఏంటి? అనే అంశాలపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్ గాంధీ నవంబర్ 3న మరోసారి సవాల్ విసిరారు. ఎక్కడైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని ఎక్స్‌లో పోస్టు చేశారు. మీడియా, దేశ యువత సమక్షంలో ఈ చర్చ జరగాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ జరగలేదని, అయినా కాంగ్రెస్ ఓటమి పాలైందని వ్యాఖ్యానించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఎస్ఐఆర్ లేదని, అయినప్పటికీ కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదని అన్నారు. పార్లమెంటు సమావేశాలను సజావుగా సాగనివ్వకుండా.. బయట సభలు, ఆందోళనలతో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. వీధుల్లో జనాన్ని సమీకరించి ఆందోళనలు కొనసాగిస్తే బీజేపీ కార్యకర్తలు తగిన సమాధానం చెబుతారని షా హెచ్చరించారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీని, కాంగ్రెస్‌ను పదేపదే తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన సభకు దేశవ్యాప్తంగా 10 లక్షల మందిని పిలిచామని కాంగ్రెస్ చెప్పిందని, అయితే సభా ప్రాంగణం సామర్థ్యం 70 వేల మందేనని, అందులోనూ సగం ఖాళీగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఆ వివరాలు తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని వ్యాఖ్యానించారు.

ముగిసిన 5వ రాష్ట్ర పోలీస్ క్రీడలు

మూడు రోజుల పాటు హోరాహోరీగా పోటీలు

1,535 మంది పోలీస్ క్రీడాకారుల భాగస్వామ్యం

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, (ప్రజా జ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 5వ రాష్ట్ర పోలీస్ క్రీడలు, ఆటల పోటీలు గురువారం



ఘనంగా ముగిశాయి. నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన 1,535 మంది పురుష, మహిళా పోలీస్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, స్కిల్ స్టోర్క్ స్కూల్, కిట్స్ కళాశాల క్రీడా ప్రాంగణం, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని రాణి రుద్రమదేవి హాలులో పోటీలు నిర్వహించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, సెపక్ తక్రా తదితర క్రీడల్లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు.ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు సిబ్బందిలో ఐకమత్యం, జట్టుగా పనిచేసే నైపుణ్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీస్ క్రీడాకారులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా లభిస్తాయని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.పోటీలను విజయవం



తంగా నిర్వహించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను ఐజీ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ క్రీడాకారులు క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారని అన్నారు. క్రీడల్లో చూపిన ఉత్సాహాన్ని ప్రజాసేవలోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు కృషి చేసిన కమిషనరేట్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాయల ప్రభాకర్ రావు, ఇతర అదనపు డీసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంఘాలకు ప్రభుత్వం భారీగా నిధులు

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్ణీత సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని బీసీ కుల సంఘాలు సమావేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించారు.

దేశాన్ని గర్వపడేలా

చేశారు



మొదటిపేజీ తరువాయి..


తీగత ఎడిషన్‌లో సాధించిన 108 పతకాల రికార్డును తిరగరాస్తూ భారత్ ఆసియా పారా గేమ్స్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ముఖ్యంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, షూటింగ్ విభాగాల్లో అథ్లెట్లు ప్రపంచ రికార్డులు నెలకొల్పి పోడియంను క్లీన్ స్వీప్ చేశారు.క్రీడాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలో క్రీడా మౌలిక వసతులు, సరైన శిక్షణ వ్యవస్థ అందుబాటులోకి రావడం వల్లే అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతోందని పేర్కొన్నారు. రాబోయే 2028 లాస్ ఏంజెల్స్ పారాలింపిక్స్ లక్ష్యంగా ఇప్పటి నుంచే తీవ్ర కసరత్తు ప్రారంభించాలని అథ్లెట్లకు ప్రధాని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, అంతర్జాతీయ పోటీల్లో మరింతగా పతకాలు సాధించి దేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ఆయన ఆకాంక్షించారు. మిమ్మల్ని అందరినీ కలవాలని నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. కొన్ని వారాల క్రితం నేను ఆసియా క్రీడల అథ్లెట్లను కలిశాను.

ఈరోజు ఆసియా పారా గేమ్స్‌లో పాల్గొన్న మిమ్మల్ని కలిసే అవకాశం నాకు లభించింది. పారా గేమ్స్‌లో మీరు చూపిన అద్భుతమైన ప్రదర్శన, క్రీడా ప్రపంచంలో భారతదేశ శక్తిని ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం పాల్గొనడం అనేది చాలా తక్కువగా ఉండేది. అంతేకాదు, పారా క్రీడల్లో మన దేశం చాలా వెనుకబడి ఉండేది. 2010 ఆసియా పారా క్రీడల్లో భారత్ కేవలం ఒక స్వర్ణ పతకంతో సహా మొత్తం 14 పతకాలు మాత్రమే గెలుచుకుంది. అయితే ఈసారి జరిగిన పారా క్రీడల్లో మన క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన చూపి మొత్తం 114 పతకాలు సాధించారు. 14 నుంచి 114 పతకాల వరకు సాగిన ఈ ప్రయాణం మీ(పారా అథ్లెట్లు) కఠోర శ్రమ, అచంచలమైన అంకితభావం, పటిష్ఠమైన వ్యవస్థే కారణం. మొత్తం 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలతో పాటు 5 కొత్త ప్రపంచ రికార్డులు, 9 ఆసియా రికార్డులతో మీరు యావత్ దేశాన్ని గర్వపడేలా చేశారని అన్నారు. పారా గేమ్స్‌లో మహిళా అథ్లెట్ల చూపిన అద్భుత ప్రదర్శన గురించి ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ నుంచి బరిలోకి దిగిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు గెలుచుకున్నారని కొనియాడారు. అలాగే, క్రీడలకు రెండు నెలల ముందు మరణించిన తన తల్లికి జావెలిన్ త్రోయర్ రింకు తన బంగారు పతకాన్ని అంకితం చేస్తూ భావోద్వేగానికి గురైన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. "ఆసియా పారా గేమ్స్‌కు కేవలం రెండు నెలల ముందు రింకు తన తల్లిని కోల్పోయారు. అంతటి తీవ్రమైన దుఃఖంలో కూడా ఆయన ధైర్యం కోల్పోకుండా, స్వర్ణ పతకం గెలిచినప్పుడు తన తల్లి ఫొటోను చేతిలోకి తీసుకుని ఆ పతకాన్ని ఆమెకు అంకితం చేశారు. ఆ క్షణం దేశంలోని ప్రతి పౌరుడినీ కంటతడి పెట్టించింది" అని మోదీ పేర్కొన్నారు. భారతదేశ క్రీడా వ్యవస్థలో తగినంత వనరులు లేకపోవడం, మద్దతు, పారదర్శకత కొరవడటం వంటి సవాళ్లను ఎదుర్కోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపడానికి ఉత్సాహం చూపలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే, క్రీడాకారుల మాదిరిగానే దేశం కూడా ఈ సవాళ్లను అధిగమించి, తన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించిందన్నారు. ఇక, 4 క్రీడా ఈవెంట్లలో పోడియంపై ఉన్న మూడు స్థానాలను (బంగారం, వెండి, కాంస్యం) భారత అథ్లెట్లే కైవసం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని మోదీ అన్నారు. అయితే, పోటీల చివరి రోజున మన అథ్లెట్లు ఏకంగా 9 స్వర్ణ పతకాలను సాధించి అద్భుతం చేశారని కొనియాడారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చేయండి

మొదటిపేజీ తరువాయి..

నియమించాలని సీఎం సూచించారు. విమానాశ్రయానికి ప్రతినిధులు చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సమావేశానికి ముందుగానే వారికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక చర్చ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యా రంగ ప్రగతిని నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు ప్రతిబింబించేలా విద్యా వ్యవస్థపై సమ్మిట్‌లో చర్చలు ఉండాలని ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సీఎం సూచించారు. నవంబర్ 15వ తేదీలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు గడువు విధించారు. తెలంగాణ ప్రతిష్టను ప్రపంచ వేదికపై మరింత ఇనుమడింపజేసేలా గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని



చేయాలని ముఖ్యమంత్రి అ ది, కా ాం ం ల న ం ఆదేశించారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్ర ద ర్శ న గా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. మరోవైపు దీపావళి వేళ ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులతో పండుగ జరుపుకుంటానని, లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో పాలుపంచుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో పండుగ చేసుకోవాలని ఆదేశించారు.

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా..

మొదటిపేజీ తరువాయి..

ఆరోపణలు చేస్తారు. కానీ నా మాటలు గుర్తుపెట్టుకోండి.. ఈ ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఎలాంటి చర్యలు ఉండవు. ఎందుకంటే బడా భాయ్ (మోదీ) తన ఏబీవీపీ ఛోటా భాయ్ (రేవంత్ రెడ్డి) పై ఎప్పటికీ చర్యలు తీసుకోరు" అని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే, బీజేపీ-కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనే కోణంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించారు. 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' మహాపాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా మాట్లాడుతూ... రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఒక ఏటీఎంగా వాడుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం 'ఆర్ఆర్ ట్యాక్స్' దందా నడుస్తోందని అమిత్ షా విమర్శించారు. ఆ ఆర్ఆర్ ట్యాక్స్ అంటే కేవలం రేవంత్ రెడ్డి ట్యాక్స్ మాత్రమే కాదని, ఇక్కడ వసూలు చేస్తున్న ఆ డబ్బులను ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చేరుస్తున్నారని, అందుకే అది 'రాహుల్-రేవంత్ ట్యాక్స్' అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిచోటా అవినీతే రాజ్యమేలుతోందని ఘాటు విమర్శలు చేశారు.



అరెస్టు తర్వాత 24 గంటల్లో కోర్టుకు

మొదటిపేజీ తరువాయి..

మినహాయించి, ఆలస్యంగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచడానికి పోలీసులకు అవకాశం లేదని స్పష్టం చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన రక్షణను అడ్డుకునేలా అరెస్టు, నిర్బంధం మధ్య వ్యత్యాసాన్ని ఉపయోగించరాదని కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చంద్రుర్కర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పు ఇచ్చింది. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత అధికారికంగా అరెస్టు నమోదు చేసే వరకు గడిచిన సమయాన్ని 24 గంటల గడువు లెక్కింపు నుంచి మినహాయించలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. అరెస్టుకు ముందు విచారణ, దర్యాప్తు, తనిఖీలు, వస్తువుల స్వాధీనం వంటి ప్రక్రియల కోసం పట్టిన సమయాన్ని కూడా గడువులో భాగంగానే పరిగణించాలని పేర్కొంది. అధికారిక అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటలు ప్రారంభమవుతాయన్న అభిప్రాయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిర్బంధం జరిగిన సమయాన్ని పక్కనపెట్టి, అరెస్టు మెమోలో నమోదైన సమయాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా ప్రాథమిక హక్కులను నీరుగార్చలేరని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని సమీప మేజిస్ట్రేట్ ఎదుట 24 గంటల్లోగా హాజరుపరచాలి. అయితే అరెస్టు చేసిన ప్రదేశం నుంచి న్యాయస్థానానికి తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రయాణ సమయాన్ని మాత్రమే ఈ లెక్కింపు నుంచి మినహాయించవచ్చు. ఇతర కారణాలతో గడువును పొడిగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై ఆర్యమన్ పట్నాయక్ కేసులో ఒడిశా హైకోర్టు, కన్నన్ కేసులో మద్రాస్



హైకోర్టు, అరుణ్ కె. థామస్ కేసులో కేరళ హైకోర్టు, అధికారిక అరెస్టుకు ముందు గడిచిన నిర్బంధ సమయాన్ని 24 గంటల లెక్కింపు నుంచి మినహాయించేందుకు అనుమతించాయి. అయితే అలాంటి అభిప్రాయాలను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి మేజిస్ట్రేట్ న్యాయస్థానానికి ప్రయాణించేందుకు పట్టే సమయం మినహా మరే సమయాన్నీ గడువు నుంచి మినహాయించలేమని స్పష్టం చేసింది.అనుమతించిన 24 గంటల గడువు ముగిసినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచని పక్షంలో సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే 24 గంటల రాజ్యాంగ గడువును పోలీసులు పాటించారా లేదా అన్న అంశాన్ని మేజిస్ట్రేట్లు స్వతంత్రంగా పరిశీలించాలి. నిర్బంధ వ్యవధి కేసు పరిస్థితులకు అనుగుణంగా సహేతుకంగా ఉందా లేదా అన్నదీ అంచనా వేయాలి. అవసరానికి మించి నిర్బంధించినట్లు గుర్తిస్తే రిమాండ్ మంజూరు చేయకుండా తిరస్కరించే అధికారం వారికి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.

త్రిపుర హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ నలుగురు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో ఈ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో సోదాలు, స్వాధీన ప్రక్రియలో భాగంగా 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు నలుగురినీ అధికారులు నిర్బంధించారు. అయితే మరుసటి రోజు అంటే సెప్టెంబర్ 30న ఉదయం 11 గంటలకు మాత్రమే వారిని అధికారికంగా అరెస్టు చేసినట్లు నమోదు చేశారు. ఈ సమయాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు, 24 గంటల గడువును సెప్టెంబర్ 29 మధ్యాహ్నం 2 గంటల నుంచే లెక్కించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంటే సెప్టెంబర్ 30 మధ్యాహ్నం 2 గంటల్లోగా వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాల్సి ఉంటుందని పేర్కొంది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967